ఈనాడు, విశాఖపట్నం, రామ్‌నగర్, న్యూస్‌టుడే: ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడతామని మెగా డీఎస్సీ-2025 ఉద్యోగులు నినదించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో విశాఖ బీచ్‌రోడ్డు ఆదివారం హోరెత్తింది. తమపై వస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ మెగా డీఎస్సీ ఆత్మ గౌరవ పోరాట సమితి ఆధ్వర్యంలో చలో విశాఖ-ఆత్మ గౌరవ గర్జన నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు. వైఎంసీఏ వద్ద జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ దగా డీఎస్సీ కాదు.. మెగా డీఎస్సీ అని, కష్టంతో సాధించామని.. పాఠాలు మాత్రమే కాదని.. గుణపాఠాలు చెబుతామని నినాదాలు చేశారు.



సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ..

# ఐక్యంగా పోరాడతాం.. ఆత్మగౌరవం కాపాడుకుంటాం..

* నినదించిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులు
* ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా తరలొచ్చి నిరసన

అనంతరం ప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వైకాపా నేతలు తమపై అసత్య ఆరోపణలు చేస్తే బంగాళాఖాతంలో కలిపేస్తాం, ఇకపై తప్పుడు ప్రచారాలకు గట్టి సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు



**దురుద్దేశంతోనే దుష్ప్రచారం:** కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడమే కాకుండా గౌరవప్రదంగా నియామకపత్రాలు అందించింది. తర్వాత శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా బాధ్యతలు అప్పగించారు. మరో రెండు నెలలైతే ఉద్యోగంలో చేరి ఏడాదవుతుంది. కొందరు కావాలనే మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. చదువుకోలేని వారు కూడా ఆరోపణలు చేస్తున్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. – కాత సూర్యకుమారి, చింతపల్లి



**పారదర్శకంగా చేపట్టారు..:** కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించింది. కొన్ని సంవత్సరాలుగా కష్టపడి చదివాం. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష రాశాం. అందులో ఎవరికి ఏ ప్రశ్న వస్తుందో తెలియదు. కీ విడుదలయ్యాక అన్ని తనిఖీ చేసుకుంటే వచ్చిన మార్కులు తెలిశాయి. మెరిట్‌లిస్టు ఇచ్చాక అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారు. ఈ డీఎస్సీ అత్యంత పారదర్శకతతో నిర్వహించారు. ఈ డీఎస్సీ తప్పితే నాకు వయసు కూడా అయిపోతుంది. ఇన్నేళ్ల శ్రమ వృథా అయ్యేది. – నరేంద్ర బొడ్డు, గోపాలపట్నం



**ఇలా ఎవరూ రోడ్డెక్కలేదు..:** డీఎస్సీ కోసం రాత్రి, పగలు లేడా లేకుండా చదివాం. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక వైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరో వైపు డీఎస్సీకి సన్నద్ధమయ్యా. విద్యను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఇంతవరకు ఏ ఉపాధ్యాయుడు తన ప్రతిభను చాటుకోవడం కోసం రోడ్డెక్కిన పరిస్థితి లేదు. అటువంటిది మమ్మల్ని రోడ్డెక్కించారు. – భాగ్యలక్ష్మి, కాకినాడ



బీచ్‌లో థింసా నృత్యం చేస్తూ నిరసన



**సముద్రంలా ఉప్పొంగుతాం:** క్రీడా కోటాలో నాకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. గురువు అంటే ఉద్యోగం కాదు.. ఒక బాధ్యత. అలాంటి వృత్తిపై అసత్యప్రచారాలు మానుకోవాలి. ఎవరికైనా సందేహం ఉంటే చట్టరీత్యా ఎదుర్కోండి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్చకు సిద్ధమని సవాలు విసిరినా ప్రతిపక్ష నేతలు ఎందుకు రాలేదు. మమ్మల్ని ఇబ్బంది పెడితే సహించం..ప్రశాంతంగా ఉన్న సముద్రాన్ని డిస్టర్బ్ చేస్తే పొంగినట్లు ఉప్పొంగుతాం. మా పోరాటంలో న్యాయం ఉంది. కష్టం, నిజం, నిరీక్షణ ఉన్నాయి. – షెహనాజ్, విశాఖ



**ఏ పరీక్షకైనా సిద్ధమే:** డీఎస్సీలో ఉద్యోగాలు తెచ్చుకున్న తమపై అసత్య ఆరోపణలు చేసి కలత చెందేలా చేస్తున్నారు. మేం ఏ పరీక్షకైనా సిద్ధమే. దుష్ప్రచారాలు చేస్తే సముద్రంలో కలిపేస్తాం. డబ్బులిచ్చి కొనుక్కున్నారని కొందరు మాట్లాడుతున్నారు. అవును..మేం రూ.750 డబ్బులిచ్చి పోస్టు కొనుక్కున్నాం. గతంలో రూ.500 అప్లికేషన్ ధర ఉంటే గత ప్రభుత్వంలో దాన్ని రూ.750కి పెంచారు. అదనంగా రూ.250 ఎక్కువిచ్చి తెచ్చుకున్నాం. – దేముడు, విజయనగరం

## నేడు మంత్రి నారా లోకేశ్ రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సోమవారం నగరానికి రానున్నారు. ఉదయం 10.15 గంటలకు ఎండాడలో ఏఐజీ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు సిరిపురం కూడలి సమీపంలో ఆకాశవాణి కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు గంభీరం వద్ద ప్రేమ విద్యాసంస్థల కళాశాల భవనం, ఏజ్ కేర్ ఫౌండేషన్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

## నీట్ పీజీ పరీక్షకు 97.58 శాతం హాజరు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా మూడు కేంద్రాల్లో ఆదివారం ఆన్‌లైన్‌లో నీట్ పీజీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,947 మంది అభ్యర్థులకు 1,900 మంది (97.58 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్ష జరిగిందని పేర్కొన్నారు. కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆయా కేంద్రాల వద్ద మధ్యాహ్నం సమయంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.





# కాదంటే కష్టమని.. జీవితమే వ్యర్థమని..

* ఐఫోన్లు, బైకులు కొనివ్వలేదని ఆత్మహత్య
* యువత ధోరణిపై తల్లిదండ్రుల్లో ఆందోళన

ఈనాడు, విశాఖపట్నం: అడిగిన వెంటనే వస్తువు కొనివ్వలేదని కొందరు యువత జీవితాన్నే వదిలేస్తున్నారు. అరచేతిలో ఇమిడిపోయే ఐఫోన్ కోసం, దూసుకెళ్లే బైకుల కోసం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో వారు తీసుకుంటున్న నిర్ణయాలు కన్నవారికి కడుపు కోతను మిగుల్చుతున్నాయి.

**నగరాలే కాదు పల్లెల్లోనూ:** నగరాల్లోనే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత ఐఫోన్లు, స్పోర్ట్స్ బైక్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు. ఆర్థిక స్తోమత లేదని తెలిసినా తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వారు నిరాకరిస్తే తట్టుకోలేకపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు అప్పు చేసి బిడ్డలు అడిగింది కొనిస్తున్నారు. అదే వారికి మృత్యు పాశంగా మారడంతో కడుపుకోతతో విలవిల్లాడుతున్నారు. విశాఖలో ఇటీవల ఓ ఆటో డ్రైవర్ రూ.2లక్షలు అప్పు చేసి కుమారుడికి బైకు కొనిస్తే..దానిపై వేగంగా వెళ్లి అదుపుతప్పి మృతి చెందాడు.

### ఇటీవలి ఘటనలు ఇలా..

1. విశాఖ కంచరపాలెం ధర్మనగర్ ప్రాంతానికి చెందిన 15ఏళ్ల బాలిక ఐఫోన్ కొనివ్వాలని తల్లిని కోరింది. ఆర్థిక స్తోమత లేదని నచ్చజెప్పినా వినకుండా గొడవ పడింది. గతనెల 26న క్షణికావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
2. గతేడాది సెప్టెంబర్‌లో పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఐఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను కోరగా డబ్బుల్లేవని చెప్పారు. దీంతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
3. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధి గొడిచర్లలో 18ఏళ్ల యువకుడు బైకు కావాలని తల్లిదండ్రులను అడిగాడు. కొనివ్వడానికి నిరాకరించినందుకు ఆత్మహత్య చేసుకున్నాడు.

### ఇవీ కారణాలు..

* సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూసి తాము విలాసవంతమైన జీవితాన్ని కోరుకోవడం.
* ప్రతిదీ ఒక్క క్లిక్‌లో వచ్చేస్తుందని అనుకుంటున్నారు. జీవితంలో కోరుకున్నవి పొందాలంటే సమయం పడుతుందనే నిజాన్ని అంగీకరించకపోవడం.
* 'వద్దు.. కాదు... లేదు' అనే మాటలను తట్టుకునే శక్తి నేటి తరం పిల్లల్లో తగ్గిపోవడం.
* బ్రాండెడ్ ఐఫోన్, స్పోర్ట్స్ బైక్ ఉంటేనే సమాజంలో, స్నేహితుల్లో గుర్తింపు ఉంటుందని భావించడం.

**గారాభంవద్దు:** పిల్లలు అడిగిన ప్రతిదీ కొనివ్వకూడదు. జీవితంలో అన్నీ అనుకున్నట్లు జరగవనే సత్యాన్ని చిన్నతనం నుంచి నేర్పాలంటున్నారు మానసిక నిపుణులు. కుటుంబ ఆర్థిక పరిస్థితి వివరించి డబ్బు విలువ తెలియజెప్పాలి. కొనివ్వని సమయంలో పిల్లల ప్రవర్తన ఎలా ఉందో గమనించాలి. ఒంటరిగా ఉండటం, కోపంతో ఊగిపోవడం, అన్నం తినకపోవడం వంటి లక్షణాలు ఉంటే అప్రమత్తమవ్వాలి. అవసరమైతే మానసిక నిపుణుల వద్ద చికిత్స చేయించాలి.

# చేయి అందించి.. సాంత్వన చేకూర్చి..

అభాగ్యులకు అండగా జీవీఎంసీ ఆశ్రయ కేంద్రాలు

న్యూస్‌టుడే, కార్పొరేషన్

1 ఝార్ఖండ్‌కు చెందిన 50 ఏళ్ల మహిళ మతిస్థిమితం కోల్పోయి రైలులో 2025 ఫిబ్రవరిలో విశాఖ చేరుకున్నారు. అధికారులు ఆమెను జీవీఎంసీ ఆశ్రయ కేంద్రానికి తరలించి.. నగరంలోని మానసిక వైద్యశాలలో చేర్పించారు. ఆర్నెళ్ల తర్వాత పూర్తిగా నయం కావడంతో చిరునామా తెలుసుకుని స్వస్థలానికి తరలించారు.

2 నగరంలోని పీఎంపాలేనికి చెందిన 34 ఏళ్ల మహిళ ఇంటి నుంచి బయటకు వచ్చేయగా ఆశ్రయ కేంద్రం సిబ్బంది చేరదీసి, చిరునామా తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇలా ఏడాదికి దాదాపు 150 నుంచి 180 మందిని చేరదీసి కుటుంబ సభ్యుల వద్దకు చేరుస్తున్నారు.

**నగరంలో 8 కేంద్రాలు**

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 20లక్షల జనాభా కలిగిన ప్రతి నగరంలోనూ రెండు లక్షల మందికి ఒకటి చొప్పున ఆశ్రయ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు జీవీఎంసీ నగరంలో ఎనిమిది ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. టీఏ స్పార్ కాంప్లెక్స్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా రెండు కేంద్రాలు, భీమ్‌నగర్, భూపేష్‌నగర్, పెదవాల్తేరు, మహారాణిపేట, ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెం, ఆరిలోవలో ఆయా కేంద్రాలు ఉన్నాయి.

**నగర సీపీ ఆదేశాలతో..:** నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ 'జ్యోతిర్గమయ' కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. నగరంలో ఎక్కడ నిరాశ్రయులు కనిపించినా ఆశ్రయ కేంద్రాల్లో చేర్పాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. గత రెండేళ్లలో పోలీసులు 511 మందిని గుర్తించి ఆశ్రయం కల్పించారు. వారిలో 123 మంది ఇళ్లకు చేరగా.. మతిస్థిమితం లేని 59 మంది మానసిక వైద్యశాలలో ఉన్నారు. మరో 49 మంది కేజీహెచ్‌లో.. వ్యసనాలకు లోనైన 35 మందిని డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించారు. మిగిలినవారు ఆయా ఆశ్రయ కేంద్రాల్లో ఉన్నారు.



**కేంద్రాల నిర్వహణ ఇలా..:** 'ఒక్కో ఆశ్రయం కేంద్రంలో ముగ్గురు కేర్ టేకర్లు, ఒక మేనేజర్ ఉంటారు. నిర్వహణకు ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.7.32లక్షల వరకు జీవీఎంసీ వెచ్చిస్తోంది. కొన్నింటికి టచ్‌స్టోన్ అనే సంస్థ ఆహారాన్ని సమకూరుస్తోంది. మరి కొన్నింటికి ఏయూటీడీ సంస్థ సొంతంగా ఆహారం తయారు చేసి అందిస్తోంది. జీవీఎంసీ ఏడాదికి రూ.15లక్షల నుంచి రూ.17లక్షల వరకు ఆయా సంస్థలకు బిల్లులు చెల్లిస్తోంది. మిగతా షెల్టర్లకు ఆయా కేంద్రాల నిర్వాహకులిచ్చే బిల్లుల ఆధారంగా చెల్లిస్తున్నాం' అని పట్టణ సామాజిక అభివృద్ధి పథక సంచాలకుడు డీవీ రమణ తెలిపారు.

# పేరుకే 'స్వచ్ఛ'త.. ఎడాపెడా నిధుల మేత

* 30 ఈ-వాహనాలకు రూ.13కోట్ల ప్రతిపాదన
* నిర్వహణ పేరుతో డబ్బులు కాజేసే పన్నాగం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలు సమకూర్చుకునే నిధులు అక్కడే వ్యయం చేసుకోవాలి. వాటిపై ఎవరి జోక్యం ఉండకూడదనే నిబంధనలున్నాయి. అందుకు విరుద్ధంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మహా విశాఖ నగరపాలక సంస్థ నిధులపై పెత్తనం చెలాయిస్తోంది. ఆ సంస్థ అధికారులు ఇష్టానుసారంగా ప్రతిపాదనలు పెట్టి నిధులు కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో తీసుకొచ్చిన ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుండటం గమనార్హం.

**భారీగా ఖర్చు:** నగరంలో చెత్త సేకరణకు టాటా ఏస్ పెట్రోలు వాహనాలను జీవీఎంసీ వినియోగిస్తోంది. 'క్లాప్' పథకంలో భాగంగా 600 వాహనాలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చుకుని నిత్యం ఇంటింటి చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారు. తాజాగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మరో ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చింది. జీవీఎంసీకి 30 విద్యుత్తు టాటా ఏస్ వాహనాలను సమకూరుస్తామని, అందుకు రూ.13 కోట్లు ఖర్చవుతుందని, ఆయా నిధులు గుత్తేదారుకు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. వాహనాల కొనుగోలు, మూడేళ్ల నిర్వహణకు భారీ మొత్తంలో ప్రతిపాదించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమాలకు తెరతీసి..:** అధికారుల లెక్కల ప్రకారం ఒక్కో వాహనం రూ.5 లక్షలు ఉంటుంది. 30 వాహనాల కొనుగోలుకు రూ.1.50 కోట్లు అవుతుంది. మిగిలిన రూ.11.50 కోట్లు నిర్వహణకు, చోదకుల వేతనాలకు ఖర్చవుతుందని చూపడంపై అనుమానాలు కలుగుతున్నాయి. విద్యుత్తు వాహనాలకు మరమ్మతులు ఉండవు. నిర్వహణ ఖర్చు తక్కువ. అయినా పెద్ద మొత్తంలో నిధులు ప్రతిపాదించడం వెనుక భారీగా అక్రమాలకు తెరతీసినట్లు సమాచారం.

**క్లాప్ వాహనాల్లోనూ అధికమే..:** ప్రస్తుతం క్లాప్ వాహనానికి కార్మికుడి వేతనంతో కలిసి రూ.72వేలు చెల్లిస్తున్నారు. అంతకు ముందు తెదేపా హయాంలో ఇది రూ.60 వేలు దాటేదికాదు. వైకాపా ప్రభుత్వంలో క్లాప్ గుత్తేదారు కోసమే రూ.12వేలు అదనంగా పెంచినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై మెకానికల్ విభాగ పర్యవేక్షక ఇంజినీరు రాయల్‌బాబు వివరణ కోరగా విద్యుత్తు వాహనాల కొనుగోలు, నిర్వహణను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చూస్తుందని చెప్పారు.



# పరస్పర అవగాహనతో సమస్యల పరిష్కారం

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సూచన





మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్; హాజరైన సీపీ శంఖబ్రత బాగ్చీ, పోలీసు అధికారులు, న్యాయవాదులు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో పరిపాలన పరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతాయని.. వాటిని పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని నూతన న్యాయస్థానాల భవనంలో ఆదివారం సమస్యలపై పరిష్కార అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ సమస్య ఎంత తీవ్రమైనా పరిష్కారానికి అనువైన మార్గాన్ని కనుగొనాలని సూచించారు. సీనియర్ న్యాయవాదులు యూఎస్ఆర్ రాజు, బండారు రామకృష్ణ, ఎన్.మాధవరావు, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మహ్మద్ ఫసియుద్దీన్‌లు న్యాయమూర్తి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఎస్పీలు తుహిన్ సిన్హా (అనకాపల్లి), అమిత్ బర్దార్ (ఏఎస్ఆర్) విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు నమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి వీవీ సుధాకర్, డీసీపీ విజయ్ మణికంఠ, ఏసీపీలు, న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారం లేకపోయినా.. అధికారుల్లా చలామణి

చోదకులపై దాడులకు దిగుతున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల వ్యక్తిగత డ్రైవర్లు

మాధవధార, న్యూస్‌టుడే

■ ఆగస్టు 20న మల్కాపురం మారుతీ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ లారీ ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఆ లారీని వెంటాడి అడ్డుకున్నారు. అధికారి సమక్షంలోనే డ్రైవర్ లారీ చోదకుడిపై దాడి చేశాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించారు.

■ ఆరు నెలల క్రితం షీలానగర్ వద్ద కూడా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వాహన డ్రైవర్ ఓ ట్రక్‌ను ఆపి చోదకుడితో వాగ్వాదానికి దిగాడు. రికార్డులన్నీ సక్రమంగా ఉన్నా జరిమానా విధించారు.

■ నాలుగేళ్ల క్రితం సైతం ఓ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ డ్రైవర్ తానే ఇన్‌స్పెక్టర్ నంటూ పలు వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అతడిని రవాణాశాఖ అధికారులు తొలగించారు. రవాణాశాఖ అధికారులు వాహనాలు తనిఖీ చేసే క్రమంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా.. కొన్ని మాత్రమే వెలుగుచూస్తున్నాయి. తనిఖీల్లో భాగంగా వాహన పత్రాలు తీసుకోవడం వంటి పనులు అధికారుల వ్యక్తిగత డ్రైవర్లే నిర్వహిస్తున్నారు. కొంతమంది బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల డ్రైవర్ల వ్యవహారం రోజురోజుకు శ్రుతి మించుతోంది. ఎదురు ప్రశ్నించిన చోదకులు, యజమానులతో దురుసుగా ప్రవర్తిస్తూ దాడులకు సైతం పాల్పడుతున్నారు. వీరి తీరుపై లారీ డ్రైవర్ల అసోసియేషన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఏదో ఒక కారణం చెప్పి కొందరు వ్యక్తిగత డ్రైవర్లు అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

■ **వ్యక్తిగత డ్రైవర్లకు ఏం అధికారం ఉందని..** నిబంధనల ప్రకారం వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాహనాలు తనిఖీ చేసేటప్పుడు వారి వెంట రవాణాశాఖ కానిస్టేబుల్ లేదా హోంగార్డ్ కచ్చితంగా ఉండాలి. వారే వాహనాన్ని ఆపి, చోదకుల నుంచి రికార్డులు తీసుకొని సంబంధిత ఇన్‌స్పెక్టర్‌కు చూపించాలి. నిబంధనలు పాటించని వారికి ఇన్‌స్పెక్టర్ జరిమానా విధించాలి. కాని.. చాలాచోట్ల ఇలా జరగడం లేదు. వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎవరికి వారు వ్యక్తిగత డ్రైవర్లను నియమించుకున్నారు. తనిఖీల్లో పాల్గొంటూ వాహనాలు ఆపడం, చోదకుల రికార్డులు పరిశీలించడం వంటి పనులన్నీ వ్యక్తిగత డ్రైవర్లే చేస్తున్నారు. ఇదేంటని అడిగిన వారిపై దాడులకు సైతం పాల్పడుతున్నారు.

■ **సిబ్బంది కొరతే కారణమా..** జిల్లాలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంవీఐలు కలిపి మొత్తం 28 మంది ఉన్నారు. రవాణాశాఖ కానిస్టేబుళ్లు, హోంగార్డ్‌లు కేవలం 10 మంది మాత్రమే ఉన్నారు. దీంతో జిల్లా అంతటా తనిఖీలు నిర్వహించడం అధికారులకు సవాలుగా మారింది. అందుకే చాలా మంది వ్యక్తిగత డ్రైవర్లను నియమించుకున్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వాహనదారులపై దురుసుగా ప్రవర్తించడం, దాడులకు దిగడం, అనధికారిక వసూళ్లకు పాల్పడటం సరికాదని ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డ్రైవర్ సంఘాలు కోరుతున్నాయి.

# గుండె జబ్బుల నిర్ధారణలో ఏఐ, కార్డియాక్ సీటీ పాత్ర కీలకం

డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడి


సీఎంఈలో పాల్గొన్న ఆస్టర్ రమేష్ ఆసుపత్రుల చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, వైద్యులు


విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: గుండె జబ్బుల నిర్ధారణ, ప్రమాద అంచనా, చికిత్స ప్రణాళికలో కృత్రిమ మేధ (ఏఐ), ఆధునిక కార్డియాక్ సీటీ సాంకేతికత కీలక మార్పులకు దారి తీస్తున్నాయని ఆస్టర్ రమేష్ ఆసుపత్రుల చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం ఆస్టర్ రమేష్ ఆసుపత్రి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ చాప్టర్ సంయుక్తంగా ఏఐ కార్డియాలజీ-ట్రాన్స్‌ఫరింగ్ రియాక్టివ్ టూ ప్రివెంటివ్ థెరపీ అనే అంశంపై నిర్వహించిన నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమంలో నెక్స్ట్ ఎరా ఆఫ్ కార్డియాక్ సీటీ ఎఫ్ఎఫ్ఆర్ అండ్ ప్లాక్ మార్ఫాలజీ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'గతంలో కార్డియాక్ సీటీని ప్రధానంగా కరోనరీ ధమనుల్లో బ్లాకేజీని గుర్తించే పరీక్షగా మాత్రమే పరిగణించేవారు. ఆధునిక సాంకేతికత అభివృద్ధితో ఇప్పుడు కార్డియాక్ సీటీ గుండె ధమనుల వ్యాధిని మరింత లోతుగా అర్థం చేసుకునే శక్తిమంతమైన సాధనంగా మారుతోంది. బ్లాకేజీ ఎంత శాతం ఉంది? అనే ప్రశ్నతో గుండెకు రక్త ప్రవాహంపై ఎంత ప్రభావం ఉంది అనేది తెలుసుకోవడం చికిత్స నిర్ణయాల్లో ఎంతో ముఖ్యం. సీటీ-ఎఫ్ఎఫ్ఆర్ వంటి సాంకేతికతలు సీటీ చిత్రాల ఆధారంగా రక్త ప్రవాహంపై బ్లాకేజీ చూపించే ప్రభావాన్ని అంచనా వేయడానికి సాయపడుతుంది. ఆధునిక ఇమేజింగ్, ఏఐ ఆధారిత విశ్లేషణలు ముందస్తు ప్రమాద అంచనాకు మరింత ఉపయోగకరంగా మారుతున్నాయి. కార్డియాక్ సీటీ భవిష్యత్తులో రోగ నిర్ధారణకే పరిమితం కాకుండా చికిత్స ప్రణాళికలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. ఏఐ, ఆధునిక ఇమేజింగ్ సాంకేతికత కలిసి పని చేయడంతో గుండె వైద్యంలో రియాక్టివ్ అప్రోచ్ నుంచి ప్రివెంటివ్, ప్రెసిస్ కార్డియాలజీ వైపు మార్పు వేగమంతమవుతోంది' అని రమేష్‌బాబు పేర్కొన్నారు. సీఎంఈలో హార్ట్ ఫెయిల్యూర్లో కృత్రిమ మేధ ఆధారిత ముందస్తు అంచనా, కృత్రిమ ఈసీజీ ద్వారా సైలెంట్ హార్ట్ అటాక్ గుర్తింపు, కార్డియాక్ సర్జరీలో ఏఐ వినియోగం, టెలీ ఐసీయూ వెర్బల్, స్మార్ట్ హాస్పిటల్ తదితర అంశాలపై చర్చించారు. ఆస్టర్ రమేష్ ఆసుపత్రి సీనియర్ వైద్య నిపుణులు రాజా రమేష్, అనూప్, రామ్‌మనోహర్, వినయ్ గాంధీ, కొల్లిపర రవికాంత్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కార్మిక నేతపై అవినీతి ఆరోపణలు

నిలిచిన పదవీ విరమణ ప్రయోజనాలు

ఈనాడు విశాఖపట్నం : విశాఖ ఉక్కులో ఓ కార్మిక నేతపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని.. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఉక్కు కార్యదర్శి, సీబీఐ, సీవీవో, సీపీ తదితరులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఫ్యామిలీ పింఛను పథకం, కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లు (సీడబ్ల్యూసీ), ఐడీ కేసులు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం(వీఆర్ఎస్) తదితర అంశాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుని ఉద్యోగ విరమణ ప్రయోజనాలను నిలిపివేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో ఈనెల 31వ తేదీతో ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగుల జాబితాలో సైతం సదరు నాయకుడి పేరు లేకపోవడం కర్మాగారం అంతటా చర్చనీయాంశం అయ్యింది.

**వసూళ్లు ఇలా...** ★ కరోనా సమయంలో మృతిచెందిన ఉక్కు ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పింఛన్ పథకం కింద లభించే ప్రయోజనాలను ఇప్పిస్తానని చెప్పి పలువురు బాధిత కుటుంబాల నుంచి డబ్బు వసూలు చేసినట్టు ఫిర్యాదు అందింది. ★ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లలో అలంకరణ పనులు చేపట్టే గుత్తేదారు నుంచి అనధికారిక రుసుములు వసూలు చేసినట్లు తెలిసింది. సీడబ్ల్యూసీల్లో ఏటా 200 కార్యక్రమాలు వరకు జరుగుతుండగా.. సుమారు రూ.50-60 లక్షల వరకూ పక్కదారిపట్టినట్లు ఆరోపణలున్నాయి. ★ 2020-25 మధ్య కాలంలో కర్మాగారం వెలుపల జరిగిన కొన్ని ప్రమాదాలను విధి నిర్వహణలో జరిగిన గాయాలుగా చూపించి ప్రయోజనాలు పొందినట్టు సమాచారం. ★ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందకపోవచ్చని ఉద్యోగులను భయపెట్టి.. వారికి సాయం చేస్తానని చెప్పి 30-40 మంది ఉద్యోగుల నుంచి సుమారు రూ. 1.5కోట్లు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ★ అంతర్గత బదిలీలు, క్వార్టర్ల కేటాయింపులు వంటి అనేక వ్యవహారాల్లో సుమారు రూ.15 కోట్లు ఈ విధంగా వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి.



## భళా.. కండల వీరుడు

సింధియా, న్యూస్‌టుడే : నేవీ ఉద్యోగి, పూర్వపు మిస్టర్ ఇండియా ఎ.అప్పలస్వామి ఆదివారం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ వ్యాయామశాలలో జిమ్ పరికరాలను ప్రారంభించడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శరీర సౌష్ఠవాన్ని అక్కడకు వచ్చిన యువత తమ కెమెరాల్లో బంధించారు. 50 ఏళ్ల వయసులోనూ ఈ విధంగా ఉండటం చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

# మునిగిపోతున్న 8మందిని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ తీరంలో ఆదివారం సముద్ర స్నానాలకని దిగిన ఏడుగురు యువకులు కొట్టుకుపోతుండగా జీవీఎంసీ, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ లైఫ్‌గార్డులు వారిని రక్షించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ (రాయపూర్)కు చెందిన రాజేంద్రసత్య, మనోజ్‌తండిల్‌వాల్, కిశోర్‌కుమార్‌ఠాకుర్, తరుణ్‌వర్మ, ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టి.మురళీ, జి.శ్రీరామ్‌కుమార్, ఆర్.తేజశ్వర్‌రావు విహారయాత్రలో భాగంగా రుషికొండ తీరానికి విచ్చేశారు. స్నానాలు చేయడానికి సముద్రంలోకి దిగారు. అలల ఉద్ధృతి అధికంగా ఉండటంతో సముద్రంలో కొట్టుకుపోతున్న వీరిని లైఫ్‌గార్డులు గుర్తించి మెరైన్ పోలీసుల సహకారంతో ఒడ్డుకు చేర్చారు. మెరైన్ సీఐ అప్పారావు, ఎస్సై మనోజ్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రెల్లివీధికి చెందిన చిన్ని ఈశ్వరరావు(56) ఆదివారం ఉదయం ఈత నిషేధిత ప్రాంతంలో స్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకుపోతుండగా గత ఈతగాళ్లు రక్షించి ఒడ్డుకు చేర్చారు. సీఐ ఎల్.అప్పలనాయుడు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ★ సందర్శకులు సముద్ర స్నానాలు చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్), వాటర్‌స్పోర్ట్స్ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న లైఫ్‌గార్డుల సేవలను కొనియాడారు.


యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

# యారాడ తీరంలో యువకుడి గల్లంతు


గల్లంతైన అవిరల్ సింగ్


యారాడ తీరం వద్ద గాలింపు పనిలో సిబ్బంది

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : యారాడ బీచ్‌లో సరదాగా ఈతకు దిగిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవిరల్ సింగ్(23) ఆదివారం గల్లంతయ్యాడు. బలమైన కెరటాలు కళ్లెదుటే ఈడ్చుకుపోవడంతో తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. ఈమేరకు న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వీరేంద్రసింగ్ దంపతులుతమ కుమారుడు అవిరల్‌సింగ్‌తో కలిసి నౌసేనాబాగ్‌లోని దగ్గర బంధువుల ఇంటికి ఈనెల 26న రాఖీ పండగ నిమిత్తం వచ్చారు. ఆదివారం ఉదయం వీరేంద్రసింగ్ దంపతులు, కుమారుడు అవిరల్‌సింగ్, మరో ఐదుగురు యారాడ సముద్ర తీరానికి చేరుకున్నారు. కొంతసేపు తీరంలో సరదాగా గడిపి ఈతకు దిగారు. అయితే బలమైన కెరటాల ధాటికి అవిరల్‌సింగ్ కొట్టుకుపోయాడు. ఉదయం కావడంతో అప్పటికి గజఈతగాళ్లు అందుబాటులో లేరు. ఆ తర్వాత వచ్చి గాలించినా అవిరల్‌సింగ్ ఆచూకీ లభ్యం కాలేదు. రాఖీపండగ కోసం వచ్చి సరదాగా గడిపిన కుటుంబ సభ్యులకు ఈ పరిణామం తీవ్ర విషాదంలో ముంచింది. తండ్రి వీరేంద్రసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేవీ, కోస్టుగార్డు, న్యూపోర్టు పోలీసులు గాలింపు చర్యల్లో పాలుపంచుకున్నారు.

# గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'


మారికవలస సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరిన విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యదర్శి గౌతమి

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని తీర్చిదిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం.గౌతమి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం మారికవలస బాలుర గురుకుల పాఠశాల క్యాంపస్‌ను ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. తరగతి గదులు తదితరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. బీసీ, సోషల్ వెల్ఫేర్ శాఖల తరహాలోనే గిరిజన సంక్షేమశాఖకు ఈ ప్రత్యేక సీవోఈ మంజూరయిందన్నారు. దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ 'ఫిజిక్స్‌వాలా'ను ఆర్ఎఫ్‌పీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఉత్తరాంధ్ర, మైదాన ప్రాంత విద్యార్థులకు అనుకూలమైన ఎడ్యుకేషన్ హబ్ కావడంతో మారికవలసను ఎంపిక చేశామన్నారు. మెరిట్ ఆధారంగా 600మంది బాలురు, బాలికలను ఎంపిక చేశామన్నారు. గురుకులాల తరహాలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు కో-ఎడ్యుకేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు, తరగతి గదులు కేటాయించడంతో పాటు అదనపు సీసీ కెమెరాలు, ప్రత్యేక వార్డెన్లు, పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపల్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

**అపోహలు వీడాలి..** తల్లిదండ్రులకు ముందే పూర్తి అవగాహన కల్పించి, విద్యార్థులకు ఘనంగా ఫేర్‌వెల్ ఇచ్చి వారి అభ్యర్థన మేరకు పక్కనే ఉన్న బాలికల క్యాంపస్, కృష్ణాపురం, సబ్బవరం గిరిజన గురుకులాలకు సురక్షితంగా బస్సుల్లో పంపించామని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రే క్యాంపస్‌ను ఖాళీ చేశారనడంలో ఎలాంటి నిజం లేదని ఆమె తేల్చి చెప్పారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గురుకుల పాఠశాల వద్ద ఉద్రిక్తత

అధికారులను అడ్డుకున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మారికవలస గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల వద్ద ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మారికవలస ఐటీ హిల్స్‌రోడ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రం ఏర్పాటు విషయంలో విద్యార్థుల వసతుల మార్పుపై అధికారుల ఏకపక్ష నిర్ణయం, సరిగా లేని సదుపాయాల కారణంగా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆందోళనకు దిగారు. బాలికల వసతి గృహాల్లోకి బాలురను తీసుకువచ్చారని, ఆయా డార్మెటరీలు అధ్వానంగా ఉన్నాయని, వాటికంటే జైళ్లే నయమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా ఆర్డీవో ఎస్.దిలీప్ చక్రవర్తిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. అధికారుల నుంచి పొంతనలేని సమాధానం రావడంతో ఆర్డీఓను పాఠశాల గేటు వద్దే అడ్డుకున్నారు. సీవోఈ కేంద్రాలకు తాము వ్యతిరేకం కాదని. . వాటి కోసం ఎన్నో భవనాలు ఉన్నాయని.. వాటిలో ఏర్పాటుచేయాలన్నారు. చిన్నారులు చదివే గురుకులాలను బలవంతంగా ఖాళీ చేయించి వాటిలో పెట్టడం సరికాదన్నారు. ఆర్డీవో బయటకు వెళ్లే సమయంలో అడ్డుకోవడంతో మరింత ఉద్రిక్తత నెలకొని తోపులాట జరిగింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి ఆర్డీవోను ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లారు.


పాఠశాల ప్రధాన గేటువద్ద ఆర్డీవోను అడ్డుకుంటున్న ప్రజాసంఘాల నాయకులు తదితరులు

## మౌలిక వసతుల కల్పనకు రూ.400 కోట్ల వ్యయానికి అనుమతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు రూ. 400 కోట్లు వ్యయం చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని కమిషనర్ కేతన్‌గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. రహదారుల అభివృద్ధి, కాలువలు, విభాగినులు, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ఆయా నిధులు వ్యయం చేస్తామని.. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏకు రూ. 200 కోట్లు చొప్పున నిధులు కేటాయించాలని పురపాలక మంత్రి నారాయణ పేర్కొన్నారని అందులో ప్రస్తావించారు.



# నేత్రదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ మీనాక్షి

రామ్‌నగర్, న్యూస్‌టుడే: వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలు ఆధునిక వైద్య విధానాల ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపగలవని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా.వి.మీనాక్షి తెలిపారు. ప్రజల్లో నేత్రదానంపై మరింత అవగాహన పెరగాలని అభిప్రాయపడ్డారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మోహిసిన్ ఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో నేత్రదాన అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ర్యాలీని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు, డా.వి.మీనాక్షి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.వి.మీనాక్షి మాట్లాడుతూ వ్యక్తి మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలు దానం చేయవచ్చని తెలిపారు. వాక్‌థాన్‌లో నేత్రదాన ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు . వైద్యులు జ్యోతిర్మయి, గోపాలరాజు, వీరేందర్ సచ్‌దేవ్, ధర్మరాజు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలపై సంతృప్తి


ఏరో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి నడుస్తున్న ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులతో కలిసి ఆదివారం రాత్రి ఆయన ఏరో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడుతూ సమయానికి బస్సులు నడుస్తున్నాయా? అని అడిగారు. 15 రోజులుగా నిర్ణీత సమయానికి వస్తున్నాయని.. ట్యాక్సీ సర్వీసుల కంటే సౌకర్యంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆర్ఎం అప్పలనాయుడు వివరించారు. విజయనగరం ఈడీ విజయగీత, గాజువాక డిపో మేనేజర్ మల్లేశ్వరరావు, విజయనగరం విజిలెన్స్ అధికారి దుర్గాప్రసాద్ తదితరులు బస్సులో ప్రయాణించారు.

# ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా హోటల్ గ్రీన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోలో పట్టుచీరల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు తెలిపారు. దేశం నలుమూలలు నుంచి తెచ్చిన విభిన్న సంప్రదాయ పట్టువస్త్రాలు ప్రదర్శనలో ఉన్నాయని పేర్కొన్నారు. 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల రెండో తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎక్స్‌పోలో చీరను ప్రదర్శిస్తూ..

# బాక్సింగ్ చెట్టు కథ ముగిసింది

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధారలో దశాబ్దాల చరిత్ర కలిగిన బాక్సింగ్ చెట్టు కథ ముగిసింది. రియల్ ఎస్టేట్ దందాకు ఈ భారీ వృక్షం బలైపోయింది. ముందుగా పాదరసం పోసి జీవం లేకుండా చేశారు. కొమ్మలు ఎండిపోవడంతో నరికి పట్టుకెళ్లిపోయారు. ఇక మిగిలిన వృక్షం మొదలును తొలగించడం వీలు కాకపోవడంతో నిప్పు పెట్టారు. మూడు రోజులుగా చెట్టు మొదలు మండుతూనే ఉంది. గతంలో ఎంతో మంది యువకులు ఈ చెట్టు నీడలోనే బాక్సింగ్ సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి, ప్రభుత్వ కొలువులు సైతం పొందారు. ఏడాదిగా ఈ వృక్షాన్ని తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నప్పటికీ జీవీఎంసీ ఉద్యానశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. చెట్టును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.


నిప్పు పెట్టడంతో చెట్టు మొదలు వద్ద మిగిలిన బూడిద

# బోటు ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడిగా లక్ష్మణరావు


ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, లక్ష్మణరావును సత్కరిస్తున్న ఆపరేటర్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ బోటు ఆపరేటర్ల సంఘ అధ్యక్షునిగా ప్రస్తుత అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేపలరేవులో ఆదివారం మాజీ కార్పొరేటర్ పేర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించి అధ్యక్ష ఎన్నిక చేపట్టారు. సమావేశానికి హాజరైన 315 మంది ఆపరేటర్లు లక్ష్మణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. మిగిలిన కార్యవర్గ సభ్యుల నియామక బాధ్యతను లక్ష్మణరావుకు అప్పగిస్తూ తీర్మానం చేశారు. 2028 వరకు అధ్యక్ష పదవిలో ఆయన కొనసాగనున్నారు. మత్స్యకారుల అభ్యున్నతి, బోటు ఆపరేటర్ల సంక్షేమానికి కృషి చేస్తానని లక్ష్మణరావు తెలిపారు. ఎన్నిక తర్వాత లక్ష్మణరావు, ఇతర నాయకులు విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, లక్ష్మణరావును గజమాలతో సత్కరించి అభినందించారు. ★ అధికార బలంతో ఎన్నికను ఏకగ్రీవం చేశారని, రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని కోరినా పట్టించుకోలేదని సంఘ మాజీ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు.

# చాకుతో కోసుకుని..విద్యుత్తు తీగలు పట్టుకొని ఆత్మహత్య

పీఎంపాలెం, న్యూస్‌టుడే: భార్య మరణంతో మానసికంగా కుంగిపోయిన ఓ విశ్రాంత ఉద్యోగి చాకుతో తనకు తాను గాయాలు చేసుకుని, విద్యుత్తు తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనపై సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన గంజా సూర్యనారాయణ(63) ఏఎస్ఐగా పని చేసి రిటైరయ్యారు. భార్య ఏడాది కిందట మృతి చెందారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గత కొంత కాలంగా మధురవాడ పరిధి రేవళ్లపాలెంలోని ఓ అపార్టుమెంట్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో వంట గదిలో చాకు తీసుకుని బయట ఉన్న కారిడార్‌కు వచ్చారు. చాకుతో మెడ, కుడి చేతి మణికట్టు, కడుపు భాగంలో కోసుకున్నారు. అనంతరం అక్కడ విద్యుత్తు మీటరు వద్ద ఉన్న తీగలను పట్టుకుని ప్రాణాలు విడిచారు. ఉదయం 6 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆరా తీశారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో ఆయనే స్వయంగా గాయాలు చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రావణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యనారాయణ ఆరిలోవ సీఐ మావగారని పోలీసులు తెలిపారు.

## చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 114 | 110 |
| లైవ్ | 141 | 130 |
| డ్రెస్డ్ | 219 | 230 |
| స్కిన్‌లెస్ | 247 | 240 |

# పెందుర్తి

**తెరపై ఈనాడు**
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
**ఇరుముడి**
స్క్రీన్-2:
**విశ్వనాథ్ అండ్ సన్స్**

## సంప్రదాయబద్ధంగా అప్పన్న స్వామి నిత్యకల్యాణం



సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ బేడామండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల వివాహ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

## 'మూడుసార్లు పంచింగ్ తగదు'

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఉద్యోగులు విధుల ప్రారంభ, ముగింపు సమయాల్లో పంచింగ్ చేస్తారు. ఇపుడు మధ్యలో కూడా పంచింగ్ చేయాలంటూ ఉక్కు యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సిటూ ఆదివారం విడుదల చేసిన ఓ కరపత్రంలో పేర్కొంది. మూడో పంచ్ పేరుతో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మాని కర్మాగారం అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

**90598 98721** సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

?: సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం పాత పోస్టాఫీస్ వీధిలోని మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - జి.సూర్యనారాయణ, ✓: పరిశీలించి పేరుకుపోయిన చెత్తను తొలగిస్తాం. - పి.అనందరావు, గ్రామ కార్యదర్శి

?: సబ్బవరం మండలం మల్లునాయుడు పాలెం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలను పదిహేను రోజులుగా తొలగించలేదు. - ఎస్.సత్యనారాయణ, ✓: త్వరితగతిన పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిస్తాం. - చైతన్య వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం

?: వేపగుంట, న్యూస్‌టుడే : 93వ వార్డు వెంకటాద్రినగర్‌లో శునకాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. - శేఖరమంత్రి శ్రీనివాసరావు, ✓: సిబ్బంది కుక్కలను పట్టుకునేలా చర్యలు తీసుకుంటాం. - అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో

## అధ్వాన దారులు.. అద్దంలా మారే



స్వయంభూవరం-సోమునాయుడు రహదారి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అద్దంలా దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో రాళ్లుదేలి గుంతలమయంగా దర్శనమిచ్చేవి. నాటి పాలకులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎక్కడికక్కడ గుంతలతో నరకయాతన అనుభవించారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఈ పరిస్థితులను గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మరింత చొరవ తీసుకున్నారు. దీంతో స్వయంభూవరం నుంచి మూలస్వయంభూవరం మీదుగా సోమునాయుడుపాలెం వెళ్లే ప్రధాన రహదారి, కలపాక-గొల్లలపాలెం మార్గం, వాడచీపురుపల్లి-వెంకటాపురం రోడ్డు, పెదముషిడివాడ-విజయరాంపురం మొత్తం నాలుగు రహదారులను అభివృద్ధి చేశారు. వీటికి నాబార్డు తదితర నిధులు రూ. 3 కోట్లు పైగా వెచ్చించారు. రహదారులపై నల్ల పిక్కతో పాటు దానిపై తారు లేయర్ వేసి రోలింగ్ చేయించడంతో దారులు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. దీంతో రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి. ఎట్టకేలకు రహదారులను బాగు చేయించడంతో ఇబ్బందులు తీరాయని స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కలపాక-గొల్లలపాలెం రోడ్డు ఇలా..

## నేడు చీమలాపల్లిలో తెదేపా విస్తృత స్థాయి సమావేశం

సబ్బవరం, న్యూస్‌టుడే: తెదేపా పెందుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం వేపగుంట రోడ్డు చీమలాపల్లి మీనాక్షి కన్వెన్షన్ హాల్-2లో సోమవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెదేపా సబ్బవరం మండల అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెదేపా జోనల్ కో-ఆర్డినేటర్, ఇచ్ఛాపురం శాసన సభ్యులు బెందాళం అశోక్, విజయనగరం జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు గొంప కృష్ణ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ బూత్ కన్వీనర్లు, తెదేపా కుటుంబ సభ్యులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## '144 ఎకరాల భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తా'



భీమిలి ఎమ్మెల్యే గంటాతో రైతుల సమస్యపై చర్చిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల, మాజీ కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు, రైతులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలో వీఎంఆర్డీఏ, రైతులకు మధ్య ఉన్న 144 ఎకరాల వివాదాస్పద భూసమస్యను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వేపగుంట-జుత్తాడ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు టీడీఆర్‌లు వెంటనే ఇప్పించాలని కోరుతున్నా అధికారులు ఇవ్వడం లేదని స్థానిక రైతులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటరు బల్ల శ్రీనివాసరావు సారథ్యంలో రైతులు శనివారం రాత్రి గంటా కార్యాలయానికి వెళ్లి సమస్యను వివరించారు. గతంలో ఇదే భూమితో ముడిపడి ఉన్నప్పటికీ రహదారులు అభివృద్ధి చేసి టీడీఆర్‌లు ఇచ్చారని, అదే పద్ధతిలో తమకు కూడా ఇప్పించాలని కోరారు. కొద్దిరోజుల్లో నగరానికి రానున్న మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని గంటా హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. రహదారి నిర్మాణ పనులను రైతులు శనివారం ఉదయం అడ్డుకున్న విషయం తెలిసిందే. టీడీఆర్‌ల కోసం పోరాటం చేయడం తప్పుకాదని, పనులు అడ్డుకోవడం సరికాదని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, పెందుర్తి

## 2న జనసేన సేవా కార్యక్రమాలు

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలో జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పీఏసీ సభ్యుడు కోన తాతారావు అధ్యక్షతన నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు గాజువాకలో బైకు ర్యాలీ, 11 గంటలకు కేరళ నుంచి లైవ్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడతారన్నారు.

## రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న జన సైనికులు

నరవ(దేవగుంట), న్యూస్‌టుడే: నాయకులు సామాజిక సేవలతో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని 88వ వార్డు సీనియర్ జనసేన నాయకుడు వబ్బిన జనార్దన శ్రీకాంత్ అన్నారు. సెప్టెంబరు 2న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వార్డు జనసేన యువకులు, తానుబిల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలతోనే అభిమానులు జన్మదిన వేడుకలు జరపాలని పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచనలతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 40 మంది జనసైనికుల నుంచి వైద్యబృందాలు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ప్రవీణ్, శివ, నవీన్, అశోక్, శ్రీను, బొబ్బరిశ్రీను, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి చినగంట్యాడ ప్రాంతానికి చెందిన నెల్లిమర్ల భగవాన్ గౌడ్ ఆదివారం రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావుకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



ఏఈవో తిరుమలేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న దాతలు

## వేంకటాద్రిపై ముగిసిన చాతుర్మాస్య పూజలు



వేంకటాద్రిపై శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై శ్రీనివాసుడి సన్నిధిలో పదహారు రోజుల పాటు జరిగిన చాతుర్మాస్య పూజలు ఆదివారం మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో సంప్రదాయబద్ధంగా పరిసమాప్తమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. వేదమంత్రాల నడుమ హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి జరిపించారు. అనంతరం దేవేరుల సమేతుడైన మలయప్ప స్వామిని వధూవరులుగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ శాంతి కల్యాణోత్సవం జరిపించారు. 108 మంది దంపతులు కంకణధారణ చేసి కల్యాణ క్రతువు వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## నేడు నేస్తాలమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి దళాయిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీనేస్తాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సోమవారం ప్రారంభోత్సవం చేయనున్నట్లు గ్రామపెద్దలు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో ఉదయం 10.49 గంటలకు వేదపండితుల మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం ఉదయం పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్‌ఆర్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన బొడ్డేటి జశ్వంత్ (24), తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన రిజ్వాన్ (20) స్నేహితులు. ఆదివారం నాయుడుతోట సమీప కల్యాణ మండపంలో శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. పని ముగించుకుని బీఆర్‌టీఎస్ మధ్య మార్గంలో గోపాలపట్నం వైపు వెళ్తుండగా కారును అధిగమించే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో జశ్వంత్‌కు చేయి విరిగింది. రిజ్వాన్ తలకు గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

## మురుగు కాలువకు మోక్షమెప్పుడో?

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఇరువాడ గ్రామంలో మురుగు పోయేందుకు కాలువ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామాలయం నుంచి ఊరి చివరి వరకు మురుగు నీటి కాలువ లేకపోవడంతో దోమలు పెరిగి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు పట్టి పీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము కష్టపడి పని చేసిన కూలి డబ్బులు ఆసుపత్రులకు పోయాల్సి వస్తోందని గ్రామస్థులు వెల్లడించారు. గ్రామంలోని ప్రధాన కాలువకు సీసీ డ్రైనేజీ నిర్మించి తమ కష్టాలు గట్టెక్కించాలని ఇటీవల ఇరువాడ వచ్చిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కోరామన్నారు. త్వరలోనే కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. ఆ దిశగా వెంటనే నిధులు మంజూరు చేయించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇరువాడలో సీసీ కాలువకు నోచుకోని డ్రైనేజీ

## నీటి సరఫరాకు అవాంతరం.. తప్పని తిప్పలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి జోన్‌లోని జీవీఎంసీ వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాకు తరచూ అవాంతరాలు జరుగుతున్నాయని పలు కాలనీలకు చెందిన నివాసితులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నీటి సరఫరా జరగాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి సరఫరా అవుతోందని వాపోయారు. ఒక్కోసారి వరుసగా రెండు రోజులు నీరు రావడం లేదని పేర్కొన్నారు. సిబ్బందిని ప్రశ్నిస్తే మరమ్మతులు జరుగుతున్నాయని సమాధానమిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఒక్కోసారి మధ్యాహ్నం పూట నీరందిస్తున్నారని తెలిపారు. సమయపాలన లేకపోవడంతో పాటు అస్తవ్యస్త సరఫరా కారణంగా వివిధ పనుల కోసం బయటకు వెళ్లే వారు ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రతిరోజు సక్రమంగా నీటి సరఫరా చేయడంతో పాటు సమయపాలన తప్పకుండా క్రమపద్ధతిలో నీరందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఈ బోరులో నీరొచ్చేదెలా సారూ..!

వేపగుంట, న్యూస్‌టుడే: వెంకటసాయినగర్‌లో మంచినీటి బోరు మట్టిలో కూరుకుపోయి నెలలు గడుస్తోంది. బోరు హెడ్ పూర్తిగా తుప్పుపట్టి ఊడిపోయింది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాగైతే ఈ బోరుతో ప్రయోజనం ఏమిటంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి సామాజిక భవనం వద్ద ఫంక్షన్‌లు జరిగితే మంచినీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా మంచినీటి బోరును బాగు చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిలో కూరుకుపోయిన బోరు

## శిథిల వంతెనపై.. భయం భయం



శిథిలావస్థలో వంతెన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక నుంచి తిక్కవానిపాలెం, దళాయిపాలెం వెళ్లే మార్గంలో ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్తు ప్లాంటు సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో వాహనదారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పెద్ద రంధ్రాలు పడటంతో పాటు ఇనుప చువ్వలు తుప్పు పట్టి బయటకు దర్శనమిస్తున్నాయి. వంతెన మీదుగా రాకపోకలు సాగించాలంటే భయమేస్తోందని, మరో గత్యంతరం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ పయనించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వంతెన నేడో మాపో అన్నట్లుగా ఉండటంతో భయాందోళన చెందుతున్నారు. వంతెనకు రంధ్రం పడిన ప్రదేశం వద్ద గొట్టాలు పెట్టి చేతులు దులిపేసుకున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెనకు పడిన రంధ్రం

## మార్షల్ ఆర్ట్స్‌లో క్రీడాకారుల సత్తా

గురుద్వారా, న్యూస్‌టుడే: చెన్నై, విశాఖ నగరాల్లో ఈ నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ సంస్థ క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచారని నగరానికి చెందిన పీఎస్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పి.నరసింహరావు తెలిపారు. ఆదివారం గురుద్వారా దరి వసంతబాల పాఠశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది స్వర్ణ, 12 మంది రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా ఎస్పీ రామోజీ రమేశ్ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం పీఎస్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన శివరామకృష్ణ, పృథ్వీరాజ్‌లను సౌత్ ఇండియా, రాష్ట్ర కరాటే చీఫ్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకులు ఎస్‌వీ రమణ, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

## ఉన్నత లక్ష్యాల సాధనకు చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో యువత భవిష్యత్తు తరాలకు ఆదర్శవంతంగా నిలవాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ సూచించారు. పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గుర్రమ్మపాలెం, ఆదివారం రాత్రి రాజయ్యపేట గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఐ సతీశ్‌కుమార్ గ్రామాల్లోని యువతతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సమాజాన్ని చైతన్యపరిచేలా వ్యవహరించాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల నియంత్రణ, ఓటీపీ మోసాలు, మాదకద్రవ్యాలు, తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు.



గుర్రమ్మపాలెంలో యువతకు సూచనలిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని మాజీ కార్పొరేటర్, తెదేపా సీనియర్ నేత రౌతు శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ.మర్రిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గత రెండేళ్లకాలంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిందన్నారు. ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన పనులను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జెర్రిపోతుల అప్పారావు, శ్రీనివాసరావు, మహేష్, దేముడు, చెల్లారావు, గణేశ్ పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరావు, తదితరులు

## డంపింగ్‌యార్డుల్లా కాలనీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కొద్ది రోజులుగా వ్యర్థాలను తరలించకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. వ్యర్థాలు కుళ్లి దుర్గంధం రావడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద ఎక్కువ కావడంతో కంటినిండా నిద్ర కరవైందని గగ్గోలు పెడుతున్నారు. కాలనీలో పందుల బెడద సైతం అధికంగా ఉంది. వ్యర్థాలను పందులు చిందరవందరగా చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీల్లో చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నారు.



గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పేరుకుపోయిన చెత్త



సాయినగర్ కాలనీలో 60 అడుగుల రహదారి పక్కన వ్యర్థాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం సాయినగర్ కాలనీలో 60 అడుగుల రోడ్డు పక్కన వ్యర్థాలు వేయడంతో డంపింగ్‌యార్డుగా మారింది. నెలల తరబడి అధికారులు అలానే వదిలేయడంతో ఈగలు, దోమలు పెరిగిపోయాయి. వర్షాలకు తడిసి దుర్వాసన రావడంతో భరించలేకపోతున్నామని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జ్వరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు. పంచాయతీ అధికారులకు పదేపదే చెబుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గంట వ్యవధిలో ఆభరణాల రికవరీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటోలో మర్చిపోయిన విలువైన ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు గంటల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మారికవలస గాయత్రీ కళాశాలలో బీటెక్ చదువుతున్న జి.దినేష్, అతని సోదరి శరణ్యలు స్థానికంగా వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నగరానికి వెళ్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి తిరిగి మధురవాడ వచ్చారు. ఈ సందర్భంలో తాము ప్రయాణించిన ఆటోలో విలువైన బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ తదితర సామగ్రి మరిచిపోయారు. తర్వాత విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం ఎస్సై ఎస్.సూర్యప్రకాష్, కానిస్టేబుల్ రవినాయక్‌లు ఆటో యూనియన్ సహకారంతో వారు ప్రయాణించిన వాహనాన్ని గుర్తించి బ్యాగ్‌ను సురక్షితంగా స్వాధీనం చేసుకుని బాధితులు పోగొట్టుకున్న వస్తువులను అప్పగించారు.

## లంకెలపాలెం పాఠశాలకు క్రీడా ప్రతిభా పురస్కారం

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు (2026) లభించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జీజీఎస్ నాగేశ్వరరావు చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొని 119 పాయింట్లతో జిల్లాలో మూడోస్థానంలో నిలవడంతో ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.



డీఈవో చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీడీలు

## నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్

పరవాడ, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గొర్లెవానిపాలెం టిడ్కో కాలనీలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పాల్గొని మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. రేషన్ డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ, వరలక్ష్మి, రాజకుమారి, దేవి, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

## ఉత్సాహంగా నడక పోటీలు



పాత గోశాల వద్ద పోటీలను ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల ప్రాంతానికి చెందిన ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లాస్థాయి నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు టి.మురళి, కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఔత్సాహికులు పాత గోశాల కూడలి నుంచి అప్పన్నపాలెం వరకు నడక పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ ఆర్‌ఆర్‌ఎస్.మహేశ్, ఎలక్ట్ గవర్నర్ జ్యోతి కమల, డాక్టర్ పైడిశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు బి.సత్యనారాయణ, రామకృష్ణ కవి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పార్టీకి కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక క్యాంపు కార్యాలయంలో పీఎస్‌ఆర్ సంస్థల యజమాని, న్యాయవాది పెంటకోట శంకరరావు తెదేపాలో చేరిన సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి అభినందించారు. యువత నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు స్పోర్ట్సు మీట్‌కు న్యాయనిర్ణేతల నియామకం

గాజువాక, న్యూస్‌టుడే: వచ్చేనెల 1 నుంచి నాలుగురోజులపాటు మంగళగిరిలో నిర్వహించనున్న ఏపీ పోలీసు స్పోర్ట్సు మీట్‌కు న్యాయ నిర్ణేతలుగా విశాఖ నగరానికి చెందిన మాజీ సైనికుడు జి.ఈశ్వరరావు, విశాఖ పోర్టుకు చెందిన సీహెచ్ చినబాబు, బి.గణపతిరెడ్డిలు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్పోర్ట్సు కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

## యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

రామ్‌నగర్, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఆదివారం క్రీడలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన ర్యాలీని పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడలు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత రోజువారీ జీవితంలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమిలి

### సినిమాలు
న్యూస్‌టుడే, చిట్టివలస (తగరపువలస)

| | |
|---|---|
| గణేశ్ | హుషార్ పిట్టలు |
| తాతా | ఇరుముడి |
| సప్తగిరి | విశ్వనాథ్ అండ్ సన్స్ |
| రాములమ్మ | టాక్సిక్ |

## కూటమి పాలనలో సమగ్ర అభివృద్ధి

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తోందని జీవీఎంసీ 98వ వార్డు మాజీ కార్పొరేటర్ పీవీ. నరసింహం పేర్కొన్నారు. 98వ వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం అడివివరం గ్రామం శిడగంపేటలో ఇంటింటికి తెదేపా కార్యక్రమం జరిగింది. కరపత్రాలు పంపిణీ చేసి వార్డు పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నాయకులు సన్యాసప్పడు, కనకారావు, అప్పలరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా
99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: మధురవాడ జోనల్ కార్యాలయం వెనుక కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. -స్థానికులు
✓: శుభ్రత పనులు చేపడతాం. -సాయికుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: ఎండాడ ట్యాంక్‌బండ్ వద్ద బహిరంగ వ్యాయామ పరికరాలు పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయి. -రవికాంత్ ✓: మరమ్మతులు చేయాలని ఆదేశాలిస్తాం. -వి.అయ్యప్పనాయుడు(జెడీ)

?: మిథిలాపురి వుడా కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే మార్గంలో పందుల సంచారం ఎక్కువగా ఉంటోంది. -కామేశ్వరరావు
✓: పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -ఎస్.కిరణ్, వెటర్నరీ అధికారి

## చుట్టూ సమస్యలు.. మధ్యలో టిడ్కో ఇళ్లు!
మౌలిక వసతులు లేక స్థానికులు అవస్థలు

ఆనందపురం, న్యూస్‌టుడే

మండలంలోని దబ్బంద లోని ఏపీ టిడ్కోగృహ సముదాయం అధ్వానంగా దర్శనమిస్తోంది. పనికిరాని మొక్కలు, దట్టమైన పొదలతో స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. సరైన వసతులు లేక నివాసితులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.


గృహాలపైకి పాకిన తీగపాదులు..

**పట్టించుకునే నాథులే లేరు..:** ఈ టిడ్కో గృహ సముదాయంలో మొత్తం 40 బ్లాకుల్లో 1,920 ఇళ్లు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ 70 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. తాగునీరు, కాలువల నిర్వహణ తదితర వసతులు సైతం లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల నిర్వహణ లేక చెత్త పేరుకు పోతోందని.. దోమలు, దుర్వాసన వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాలు, రహదారులు వంటి ప్రాంతాల్లో పొదలు పెరిగి పాములు, విష పురుగులకు ఆవాసంగా మారాయంటున్నారు. రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇళ్లలోకి పాములు వస్తున్నాయని నివాసితులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ఇళ్లకు సమీపంలోనే పాము పుట్టలు ఉన్నాయని చిన్నారులు అటుగా వెళ్లి ఆటలు ఆడుకునే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకోవచ్చని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ నుంచి దూరంగా కొండల మధ్య వసతులు లేని చోట నిర్మాణాలు చేయడంతో ఎవరూ ఇళ్లలో ఉండేందుకు మక్కువ చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దబ్బంద ప్రధాన రహదారి నుంచి ఈ గృహ సముదాయం వరకు సుమారు 1.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథులే లేరంటున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.


పనికిరాని మొక్కల మధ్య ఇలా..

## ఉత్సాహంగా నడక పోటీలు


పాత గోశాల వద్ద పోటీలను ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు పాత గోశాల ప్రాంతానికి చెందిన ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లాస్థాయి నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు టి. మురళి, కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో జరిగిన పోటీలను వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఔత్సాహికులు పాత గోశాల కూడలి నుంచి అప్పన్నపాలెం వరకు నడక పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ ఆర్‌ఆర్‌ఎస్.మహేశ్, ఎలక్ట్ గవర్నర్ జ్యోతి కమల, డాక్టర్ పైడిశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు బి.సత్యనారాయణ, రామకృష్ణ కవి తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘంలో బంగారం రుణాల మొత్తం పెంపు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్సు దరి ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో


అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సంఘం అధ్యక్షుడు అప్పలస్వామి, డైరెక్టర్లు

డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను పాలకవర్గం ప్రవేశపెట్టింది. సంఘంలో ఇప్పటి వరకు ఒక గ్రాము బంగారంపై రూ.7,500 రుణం మంజూరు చేస్తుండగా ఇకపై రూ.9వేలకు పెంచాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పాత బకాయిల వసూలుకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ (వోటీఎస్) అమలు చేస్తున్న నేపథ్యంలో బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు బి.మహేశ్వరరావు, డైరెక్టర్లు ఈశ్వరరావు, శ్రీనివాసరావు, ధర్మరాజు, సూరిబాబు, ప్రసాద్‌రెడ్డి, గురునాథరావు, రామకృష్ణ, కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత కచేరీ


రుషికొండ టీటీడీ ఆలయంలో సంగీత కచేరీ చేస్తున్న తమ్మిన సిస్టర్స్

ఎండాడ, న్యూస్‌టుడే: రుషికొండ మహాలక్ష్మీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో 'సప్తస్వరాయలం'(స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) వారి ఆధ్వర్యంలో తమ్మిన సిస్టర్స్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కచేరీలో షణ్ముఖ ప్రియ, కోమలి, లక్ష్మీ సహన, కృష్ణసహస్ర, గీతామాధురి, పోతూరు ఉమ తదితరులు తమ గాత్రాలతో అలరించారు. వయోలిన్‌పై గీతప్రియ, మృదంగంపై సాహితిప్రియ సహకారం అందించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించారు.

### ● ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని మారికవలసలోని ఓ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీనిపై సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎంపాలెం చివరి బస్టాప్ ప్రాంతంలో ఉంటున్న సతీష్‌కుమార్ తన మామ డి.భాస్కరరావు(56)ను వైద్య చికిత్స నిమిత్తం మారికవలస జీవీపీ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ నెల 26న ఉదయం ఆసుపత్రి నుంచి భాస్కరరావు వెళ్లిపోయారు. గడచిన నాలుగు రోజులుగా కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం పలుచోట్ల గాలించినప్పటికీ ఫలితం లేక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అల్లుడు సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ● నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పద్మనాభం: రేవిడి ఫీడర్ పరిధిలో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ ఎ.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. కోరాడ, గెద్దపేట, భద్రయ్యపేట, సుంకరపేట, లింగన్నపేట, బొత్సపేట, బుడ్డివలస, బీఆర్.తాళ్ళవలస, వెంకటాపురం, రేవిడి, కురపల్లి, బర్లపేట తదితర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.

★ మధురవాడ: మధురవాడ సెక్షన్‌లోని సుద్దగెడ్డ ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో ఆర్టీసీ కాలనీ ఫీడర్‌పై నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మానం ఆంజనేయులు కాలనీ, అయోధ్యనగర్, వాంబే కాలనీ, కళానగర్, మల్లయ్యపాలెం, ఆర్టీసీ కాలనీల్లో తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు.

### ● 'మూడుసార్లు పంచింగ్ తగదు'

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఉద్యోగులు విధుల ప్రారంభ, ముగింపు సమయాల్లో పంచింగ్ చేస్తారు. ఇప్పుడు మధ్యలో కూడా పంచింగ్ చేయాలంటూ ఉక్కు యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సిటూ ఆదివారం విడుదల చేసిన ఓ కరపత్రంలో పేర్కొంది. ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మాని కర్మాగారం అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

### ● ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

గ్రామీణభీమిలి: భీమిలి బీచ్‌రోడ్డులోని మంగమారిపేట జంక్షన్ వద్ద ఉన్న మైదానంలో భాజపా నేతల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఎండాడ, మధురవాడ శాఖల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో పలువురు నాయకులు పాల్గొని ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. ఈ స్నేహపూర్వక పోటీల్లో మధురవాడ జట్టు విజయం సాధించింది. భాజపా నియోజకవర్గ కన్వీనర్ జీరు కైలాశ్‌రెడ్డి, విజయానందరెడ్డి తదితరులు ఉన్నారు.

### ● రూ.1,020 కోట్ల రుణాలకు ఇండియన్ బ్యాంక్ ఆమోదం

రామ్‌నగర్, న్యూస్‌టుడే: రిటైల్, వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగాలకు ఊతమిచ్చేలా భారీగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్ తెలిపారు. ఇండియన్ బ్యాంక్, హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ కార్యాలయం (ఎఫ్‌జీఎంవో) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన మెగా క్రెడిట్ క్యాంప్ కార్యక్రమంలో రూ.1,020 కోట్ల రుణాలకు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎం.శ్రీరామచంద్రబాబు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

## సాగర్ వాకర్స్ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సంఘం 2026-2029 కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఆదివారం స్థానిక సాయిసదనం ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కోట మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా అమనాపు అప్పలనాయుడు, కోశాధికారిగా బి.బాలాజీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.ఆనందరావు, కె.పద్మారాణి, వి.సుందరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి.సింహాద్రి, బి.తిరుమలరెడ్డి, ఎన్.నర్సింగరావు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎల్.గణపతి రావు, జి.మరియదాసు, పీఆర్వోలుగా ఎం.వి.పార్వతీశం, ఎస్.సూర్యనారాయణ నియమితులయ్యారు.

## సింహగిరిపై నృత్య కళా వైభవం


నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై రెండు రోజుల పాటు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మధురవాడకు చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలకు కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు సమ్మోహితులను చేశాయి. అధికారులు కళాకారులను సత్కరించారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిట్టివలస(తగరపువలస),న్యూస్‌టుడే: బిగ్‌బాస్ విజేత కల్యాణ్ పడాల హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో చిట్టివలస జ్యూట్‌మిల్ కల్యాణ మండపంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర వైద్య నిపుణులు భావన, అక్షయ, నర్సింగ్, తేజేశ్వరి, రాజు 135 మంది రోగులను పరీక్షించారు. 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సొసైటీ వాలంటీర్లు కోమలత, జానూ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నస్వామి సన్నిధిలో వైవీ సుబ్బారెడ్డి


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం, న్యూస్‌టుడే: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు. ఆయన వెంట వైకాపా నాయకులు కె.కె.రాజు, శరగడం చినఅప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి చినగంట్యాడ ప్రాంతానికి చెందిన నెల్లికొండ భగవంత్ గౌడ్ ఆదివారం రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావుకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


ఏఈవో తిరుమలేశ్వరరావుకు విరాళం చెక్కు అందిస్తున్న దాతలు


నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం, పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

## సంప్రదాయబద్ధంగా అప్పన్న స్వామికి నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ బేడామండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల వివాహ వేడుకను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

## ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ.. హరే కృష్ణ నామస్మరణతో ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్రబలభద్ర, జగన్నాథ, నృసింహ, ఆంజనేయ స్వాములు, సీతారాముల విగ్రహాలను ఆకర్షణీయంగా అలంకరించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీనితాయి సేవిని తదితర కృష్ణభక్తులు గీతాలాపనలు చేశారు. అన్నసమారాధన చేపట్టారు. రానున్న కృష్ణాష్టమి సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రతిరోజూ విభిన్న రూపాల్లో అలంకరిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం గొల్లల తాళ్లవలస పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంఠమణి తరుణ్ కుమార్(19) ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యువకుడు సంగివలసలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం రాత్రి ఆనందపురం-తగరపువలస జాతీయ రహదారి సర్వీసురోడ్డులో సంగివలస తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నగరంలోని కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుని స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, వేలివెన్ను అని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ దివాకర్ చెప్పారు.

## మద్యం అక్రమ విక్రయాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 39 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.చంద్రమౌళి తెలిపారు. నరసాపురం గ్రామానికి చెందిన పాండ్రంగి రాము, గెద్దపేట గ్రామానికి చెందిన గెద్ద కళావతిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలో బెల్టు దుకాణాలను నిర్వహిస్తూ మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈయన నుంచి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ దివాకర్ చెప్పారు.

## అంతర్గత రహదారులపై మురుగుతో అవస్థలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వవార్డు సాయిప్రియాగార్డెన్స్ లే-అవుట్‌లోని పలు అంతర్గత రహదారులపై మురుగునీరు చేరడంతో నివాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఎంవీవీ ఐకానిక్, క్రాంతి క్లాసిక్ బహుళ సముదాయాల నుంచి ప్రవహించే మురుగు రహదారులపైకి చేరుతోందని.. సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు సైతం బయటకు రావడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





## పుట్టినరోజు వేడుకల్లో వన్యప్రాణుల దత్తత

ఎండాడ, న్యూస్‌టుడే: పలువురు చిన్నారులు పుట్టినరోజులను పురస్కరించుకుని ఇందిరా గాంధీ జంతుప్రదర్శనశాల(జూ)లో వన్యప్రాణులను దత్తత తీసుకున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలో అమలవుతున్న 'జంతు దత్తత' కార్యక్రమంలో భాగంగా గడచిన వారం రోజులుగా మొత్తం 10 వన్యప్రాణులను దాతలు దత్తత తీసుకుని వాటి సంరక్షణ కోసం రూ.1,46,100 విరాళంగా అందించారన్నారు. వీటిలో కొన్నింటిని ఏడాది పాటు, మరి కొన్నింటిని నెలల పాటు దత్తతగా స్వీకరించారన్నారు. రెడ్డి విహాన్‌వర్ధన్ 4 జంతువులకు(హిమాలయన్ గోరల్, చిలుక, చిరుతపులి, చారల హైనా) కలిపి రూ.38 వేలు, సియాన్ తన్వి 3 జంతువులకు(రాయల్ బెంగాల్ టైగర్, హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి, చుక్కల జింక) రూ.30,600, అలాగే హేమఐశ్వర్య గొల్లు కుటుంబ సభ్యులు (హిమాలయాన్ గోరల్) రూ.10 వేలు, సత్తారు కనిష్క(హిమాలయాన్ నల్ల ఎలుగుబంటి) రూ.54 వేలు, సత్తారు పాపినాయుడు, ఆరుద్ర(చారల హైనా) రూ.13,500 విరాళంగా ఇచ్చారన్నారు. దాతలకు జూ అధికారులు 'జంతు దత్తత' ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సహాయ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, ఎఫ్ఎస్ఓ బి.భారతి తదితరులు పాల్గొన్నారు. దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు 94915 69344, 93915 26937, 78936 32900 నంబర్లలో సంప్రదించాలని క్యూరేటర్ సూచించారు.


దాతలకు జంతు దత్తత ధ్రువపత్రాలు అందిస్తున్న క్యూరేటర్ మంగమ్మ తదితరులు

## ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో 1387 మంది అభ్యర్థులకు 1349 మంది హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పరీక్ష సందర్భంగా వెస్ట్ జోన్ ఏసీపీ ప్రదీప్తి ఆధ్వర్యంలో పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విశాఖ నగర ట్రాఫిక్ ఏడీసీపీ అన్నెపు నరసింహమూర్తి, వెస్ట్ సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ సురేశ్ ట్రాఫిక్ బందోబస్తును పర్యవేక్షించారు.


చినముషిడివాడ ఐయాన్ పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

## గంట వ్యవధిలో ఆభరణాల రికవరీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటోలో మర్చిపోయిన విలువైన ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను పీఎంపాలెం నేర విభాగం పోలీసులు గంటల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మారికవలస గాయత్రీ కళాశాలలో బీటెక్ చదువుతున్న జి.దినేష్, అతని సోదరి శరణ్యలు స్థానికంగా వసతిగృహంలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నగరానికి వెళ్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి తిరిగి మధురవాడ వచ్చారు. ఈ సందర్భంలో తాము ప్రయాణించిన ఆటోలో విలువైన బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ తదితర సామగ్రి మరిచి పోయారు. తర్వాత విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం ఎస్సై ఎస్.సూర్యప్రకాష్, కానిస్టేబుల్ రవినాయక్‌లు ఆటో యూనియన్ సహకారంతో వారు ప్రయాణించిన వాహనాన్ని గుర్తించి బ్యాగ్‌ను సురక్షితంగా స్వాధీనం చేసుకుని బాధితులు పోగొట్టుకున్న వస్తువులను అప్పగించారు.


విద్యార్థికి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న ఎస్సై

## హోమియో వైద్యశిబిరానికి స్పందన


రోగికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కలిగొట్ల స్నిగ్ధశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హోమియో వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో హోమియో వైద్యులు డా.జగన్నాథ రావు, డా.మోహనరావు 85 మంది రోగులను పరీక్షించి మందులను అందించారు. సంఘ సభ్యులు వి.తాతాజీ, ఎం.శంకర్, జి.రాము పాల్గొన్నారు.

## సౌమ్యగిరిపై పచ్చదనం పెంపుదలకు తోడ్పాటు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: సౌమ్యగిరిపై పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఆదివారం మిషన్ గ్రీన్ భీమిలి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో కొండమీద విత్తనాలను వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి ఆదిత్య ఆధ్వర్యంలో వివిధ సంఘాల సభ్యులు 30 వృక్షజాతులకు చెందిన దాదాపు వెయ్యి కేజీల విత్తనాలను కొండ అంతటా వెదజల్లారు. ట్రస్టు సభ్యులు గుల్లల వెంకటేష్, ఐనాడ దుర్గాప్రసాద్, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫాబ్) సభ్యులు ముసునూరి సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల సభ్యులు

# విశాఖ తూర్పు

## 53 ద్విచక్ర వాహనాల సీజ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రహదారిపై ఇష్టారాజ్యంగా స్టంట్లు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న వాహనదారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఈస్టు సర్కిల్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్సై ధనుంజయనాయుడు, సిబ్బంది కలిసి వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సిరిపురం, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు, బీచ్‌రోడ్డులో బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. 53 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు సీఐ అమ్మినాయుడు తెలిపారు. ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

## రూ.1,020 కోట్ల రుణాలకు ఇండియన్ బ్యాంక్ ఆమోదం


మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్

రామ్‌నగర్, న్యూస్‌టుడే: రిటైల్, వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాలకు ఊతమిచ్చేలా భారీగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్ తెలిపారు. ఇండియన్ బ్యాంక్, హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ కార్యాలయం (ఎఫ్‌జీఎంవో) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన మెగా క్రెడిట్ క్యాంప్ కార్యక్రమంలో రూ.1,020 కోట్ల రుణాలకు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.512 కోట్లు, రిటైల్ విభాగానికి రూ.351 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.157 కోట్లు కేటాయించామన్నారు. వ్యవస్థాపకత, జీవనోపాధి, సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి ఈ మూడు రంగాలు కీలకమని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు, వ్యక్తిగత రుణగ్రహీతలు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల వారికి సకాలంలో సులభంగా రుణ సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎం.శ్రీరామచంద్రబాబు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

## కైలాసగిరిపై పర్యాటకుల సందడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పర్యాటక ప్రదేశం కైలాసగిరిపై ఆదివారం సందడి నెలకొంది. రోప్‌వే ద్వారా 1,572 మంది, బస్సు మార్గంలో 2,067 మంది, మెట్ల మార్గంలో 549 మంది వచ్చారని అధికారులు తెలిపారు. గాజు వంతెన, శివపార్వతులు, త్రిశూల్ ప్రాజెక్టు వద్ద ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. ఆగిపోయిన అద్దాల రైలు తిప్పాలని పలువురు కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
ఎంవీపీ కాలనీ: 9908062434
మద్దిలపాలెం: 9912120229

**ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే:** ?: అప్పుఘర్ ప్రాంతంలో వారాంతపు రోజుల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. – **ఆర్ విశ్వనాథ్** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – **రామ్మూర్తి, ఎస్ఐ ట్రాఫిక్**
?: సెక్టార్-8లో కొళాయి నీరు బురదగా వస్తోంది. – **వి.రామ్ ప్రకాష్** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – **కల్యాణి, ఏఈ తాగునీటి సరఫరా విభాగం**
?: సెక్టార్-6 లో పార్కుల పక్కనే చెత్త వేస్తున్నారు. – **ఆర్ఎస్ రామకృష్ణ** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం – **కనకమహాలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
**శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే:** ?: శివాజీపాలెం, శివాజీపార్కు రహదారి మార్గంలో యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకుల కారణంగా రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. – **ప్రసన్నకుమార్, శివాజీపాలెం** ✓: సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. – **రహీం, ఏఈ**
**స్వర్ణభారతి(మద్దిలపాలెం), న్యూస్‌టుడే:** ?: సిద్ధార్థనగర్, న్యూరేసపువానిపాలెం ప్రాంతాల్లో కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. – **గుణలక్ష్మి, న్యూరేసపువానిపాలెం** ✓: సిబ్బందిని పంపించి పూడికలు తీయిస్తాం.– **శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
**ఆరిలోవ, న్యూస్‌టుడే:** ?: 13వ వార్డు పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం వద్ద కాలువలు శుభ్రం చేయడం లేదు. – **నరసింహులు, పైనాపిల్ కాలనీ** ✓: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. – **పి.వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
**విశాలాక్షినగర్, న్యూస్‌టుడే:** ?: ఆరిలోవ అంబేడ్కర్ కూడలి నుంచి టీఐసీ పాయింట్ వరకు ఇరుకు దారిలో వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. – **శ్రీనివాస్, అంబేడ్కర్ నగర్** ✓: పరిశీలించి వాహన యజమానులకు అవగాహన కల్పించి సమస్య పరిష్కరిస్తాం. – **ధర్మేంద్ర, ట్రాఫిక్ ఎస్సై**
**ఇందిరానగర్, (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే:** ?: పాత డెయిరీ ఫారం కూడలి నుంచి వెటర్నరీ కాలనీ వరకు పందులు రాత్రి వేళ రహదారి పైకి వస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – **శివనాయక్, విశ్రాంత ఉద్యోగి** ✓: పెంపకందారును హెచ్చరించి సమస్య లేకుండా చూస్తాం. – **డాక్టర్ కిరణ్ కుమార్, పశుసంవర్ధక అధికారి**

## స్పందనకు వందనం

**హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే:** 15వ వార్డు సింహాద్రిపురం, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ప్రాంతాల్లోని కాలువలను శుభ్రం చేయడం లేదని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరాంనాయుడు స్పందించారు. సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి పరిసరాలను శుభ్రం చేయించారు.
**టిఐసీ పాయింట్ (ఆరిలోవ), న్యూస్‌టుడే:** 13వ వార్డు దుర్గాబజారు ప్రాంతంలో వీధి కాలువలు శుభ్రం చేయక పోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు
**విశాలాక్షినగర్, న్యూస్‌టుడే:** పాత డెయిరీ ఫారం కూడలి నుంచి గ్రామీణ తహసీల్దారు కూడలి వరకు భూగర్భ విద్యుత్తు కేబుళ్ల కోసం తవ్వేసి సరిగా పూడ్చకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. ఈఈ సింహాచలంనాయుడు గుత్తేదారును ఆదేశించగా ఆదివారం నుంచి గుంతల పూడ్చివేత పనులు ప్రారంభించారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ సబ్‌స్టేషన్ 33/11 కేవీ నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్ 3 ఈఈ ఆపరేషన్స్ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పెదగదిలి, చినగదిలి, హెల్త్‌సిటీ, సంతపాలెం, సూర్యతేజనగర్, పార్వతీనగర్, తోటగరువు, గణబాబునగర్, అన్నానగర్, గాంధీనగర్, రవీంద్రనగర్, కైలాశ్‌నగర్, శ్రీహరినగర్, బాలాజీనగర్, ముస్తాఫాకాలనీ, జ్యోతినగర్, టీఐసీ పాయింట్, క్రాంతినగర్ తదితర ప్రాంతాల పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.


## ఎంవీపీకాలనీలో అగ్ని ప్రమాదం

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సెక్టార్-2లో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ అపార్టుమెంటు నాలుగో అంతస్తులో ఒక్కసారిగా ఏసీ లోపల నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏసీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. విద్యుత్తు ఉపకరణాలు, తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు.

## సెప్టెంబరు 1 నుంచి ఉచిత వైద్యశిబిరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, తలనొప్పి సమస్యలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సూర్యరేఖ, డాక్టర్ గౌతం కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మహారాణిపేటలోని బ్రస్ట్‌బయాప్సీ క్లినిక్‌లో ఈ నెల సెప్టెంబర్ 1 నుంచి 10 తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

## నిఘా నేత్రాలు... నిద్దరోతున్నాయ్


పాతపందులఫారం కూడలి బీఆర్‌టీఎస్ రహదారిలో పనిచేయని సీసీ కెమెరాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

★ ఆదర్శనగర్ కొండ పైభాగంలో నివాసం ఉంటున్న వారు కిందిభాగంలో వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ఆరు నెలల క్రితం ఓ ద్విచక్రవాహనం దొంగతనానికి గురైంది. అయితే ఆ కూడలిలో సీసీ కెమెరాలు పనిచేయక పోవటంతో దొంగ, ద్విచక్రవాహనం ఇప్పటికీ దొరకలేదు.

★ ఏడాది క్రితం గీతం కళాశాలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ విద్యార్థిని వెనుక అతివేగంగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. సదరు విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. కూడలిలో సీసీ కెమెరాలు పనిచేయక పోవటంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడం కష్టమైంది. స్థానికులు చెప్పిన ఆధారాలతో నెల రోజుల తరువాత బీచ్‌రోడ్డులోని దుకాణాల్లో సీసీ కెమెరాల్లో పరిశీలించి ప్రమాదం చేసిన వ్యక్తిని గుర్తించారు.

ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పోలీసులే చెబుతున్నారు. దేవాలయాలు, కాలనీల్లో యుద్ధప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేయించి నేరస్థుల గుర్తింపులో పురోగతి సాధిస్తున్నారు. అయితే ప్రధాన కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలను మాత్రం మార్చలేకపోతున్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో నిఘా నేత్రాలు నిద్దరోతుండటంతో ఆకతాయిలు, గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగించేవారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు.

★ **సీసీ కెమెరాలు పనిచేయని కూడళ్లు ఇవే..:** హనుమంతువాక, జోడుగుళ్లపాలెం, కోదండ రామాలయం, సుందర్‌నగర్, ఎస్ఐజి నగర్, పాత పందులఫారం, తోటగరువు, టీఐసీ పాయింట్, భారతి విద్యానికేతన్ పాఠశాల, ఆరిలోవ ముత్యాలమ్మ గుడి, వీరబ్రహ్మేంద్ర స్వామి, ముడసర్లోవ బీఆర్‌టీఎస్ జంక్షన్, విశాలాక్షినగర్ బీవీకే కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పెదగదిలి నుంచి హనుమంతువాక వరకు, దీనదయాళపురం సేవామార్గంలోనూ చాలా చోట్ల సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి.


రవీంద్రనగర్ కూడలిలో ఉపయోగంలో లేని సీసీ కెమెరాలు

**ఉన్నతాధికారులకు సమస్య విన్నవించాం..:** హనుమంతువాక కూడలిలో ఓ భారీ వాహనం తీగలను తెంచేయడంతో సీసీ కెమెరాలు పనిచేయటం లేదు. అలాగే పాతడెయిరీఫారం కూడలిలో సాంకేతిక కారణాలతో నిరుపయోగంగా మారాయి. ఆదర్శనగర్, ఆరిలోవ, పెదగదిలి, విశాలాక్షినగర్ అంతర్గత రహదారుల్లో చాలా చోట్ల ఇవి పనిచేయటం లేదని గుర్తించాం. గుత్తేదారుడితో కాంట్రాక్ట్ అయిపోవడంతో ఈ సమస్య వచ్చినట్లు గుర్తించాం. ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, సీఐ ఆరిలోవ పోలీస్ స్టేషన్

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నృత్యాలు, సంగీత ఫెస్టివల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 370 మంది నాట్య కళాకారులు పాల్గొని భరతనాట్యం, కూచిపూడి, నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ మాధవి, వివిధ ప్రాంతాలకు చెందిన నాట్య గురువులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

## మెగా రక్తదాన శిబిరానికి స్పందన


ధ్రువపత్రం అందజేస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ నరసింహమూర్తి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదజాలరిపేటలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మదర్ థెరెసా జయంతిని పురస్కరించుకొని ఒలిశెట్టి సత్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి ట్రాఫిక్ ఏడీసీపీ అన్నెపు నరసింహమూర్తి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు ఒలిశెట్టి గురునాథ్‌ను అభినందించారు. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, సీఐ పైడయ్య, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## వైద్యుడు జీవీఎస్ రావు మృతి

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: సత్యసాయి వైద్య సేవల కన్వీనర్, సామాజిక కార్యకర్తగా ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ జీవీఎస్ రావు(85) వయో భారంతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆంధ్ర వైద్య కళాశాలలో 1964లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన రావు సత్యసాయి సేవా కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించారు. ఉచిత వైద్య సేవలు, శిబిరాలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2017లో జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక ధన్వంతరి పురస్కారం లభించింది. ఆయన కోరిక మేరకు మరణాంతరం నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థలకు దానం చేశారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. సత్యసాయి ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు పీఆర్ఎస్ఎన్ నాయుడు, మాజీ జిల్లా అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఘర్షణలో ఒకరికి గాయాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జోడుగుళ్లపాలెంలో ఇద్దరి మధ్య తలెత్తిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. ఆరిలోవ ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 24న ఎం.అప్పలరాజు అనే వ్యక్తి ఉమ్మిడి తాతారావు ఇంటికి వెళ్లి గ్రామపెద్ద ఉమ్మిడి అప్పారావు పంపారని.. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డమ్ములు ఇమ్మన్నారని అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాతారావు దాడి చేయడంతో అప్పలరాజు కింద పడిపోయారు. ఆసుపత్రికి వెళ్లగా అంతర్గత అవయవాలకు గాయాలయ్యాయని తెలిపారు. ఈమేరకు ఆయన భార్య జ్యోతి ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సివిల్ వివాదాల్లో తలదూర్చి ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే కఠిన చర్యలు తప్పవని ఆరిలోవ శాంతిభద్రతల ఎస్సై కృష్ణ రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. ఒకసారికి మించి ఫిర్యాదు అందితే వారిని నగర నుంచి బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

## సింహగిరిపై నృత్య కళా వైభవం

సింహచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై రెండు రోజుల పాటు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మధురవాడకు చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలకు కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు సమ్మోహితులను చేశాయి. అధికారులు కళాకారులను సత్కరించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. హనుమంతువాక కొండవాలులో ఆదివారం ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరి గోవింద్, స్థానిక నాయకులు బాదరు బాలరాజు, గెడ్డవలస వెంకటరావు, కెల్లి రోహిత్, శ్రీను, లీల తదితరులు పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. తల్లికి వందనం, గ్యాస్ రాయితీ రాలేదని పలువురు ఫిర్యాదు చేయగా వివరాలు తీసుకుని సోమవారం సచివాలయానికి రావాలని సూచించారు.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం 22వ వార్డు శివాజీపాలెం, మంగాపురంకాలనీలో ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించారు. తెదేపా పార్లమెంట్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పాల్గొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు దువ్వి స్వామి, గణేష్, కె.ఆనంద్, పి.ప్రసాద్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్ రాజు

రామ్‌నగర్, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం క్రీడలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన ర్యాలీని పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడలు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత రోజు వారీ జీవితంలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక చవితి రాట మహోత్సవం


పాత వెంకోజీపాలెంలో రాట వేస్తున్న కమిటీ సభ్యులు

హెచ్‌బీ కాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు రాట మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెదగదిలి (ఆరిలోవ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 12వ వార్డు పరిధి పెదగదిలి శివాలయం ఎదురుగా పిల్లలు పార్కులో ఆదివారం గణపతి నవరాత్రి ఉత్సవాల మండప నిర్మాణానికి పందిరిరాట వేశారు. వినాయక చవితి నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని శ్రీకృష్ణ యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు.

## కాలనీల్లో సమస్యల తిష్ఠ


ఎం.ఎం.టి.సి.కాలనీలో పేరుకుపోయిన చెత్త

ఎం.ఎం.టి.సి.కాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 15వ వార్డు ఎం.ఎం.టి.సి.కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ ప్రాంతాల్లో కాలనీవాసులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు వేల జనాభా నివసించే ఈ ప్రాంతంలో కాలువలు అధ్వానంగా మారాయి. కొంత మంది భవన నిర్మాణ దారులు కాలువలపై నిర్మాణ సామగ్రి వేయడంతో కాలువల్లో మురుగు నీరు సజావుగా పారడం లేదు. వార్డులో చాలా ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకుల కారణంగా రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్, ఎం.ఎం.టి.సి.కాలనీ ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్తు పనులు నత్తనడకగా సాగుతున్నాయి. రోడ్లపై చెత్త పోగులు పేరుకుపోయాయి. తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదని కాలనీవాసులు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కారించాలని కోరుతున్నారు.


యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న మురుగునీరు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూలో 1972-1981 వరకు గణాంక శాస్త్ర విభాగం చదివిన వివిధ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఆదివారం సెమినార్ హాల్‌లో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఒకరినొకరు పరిచయం చేసుకొని వారు చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ సైన్సు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమాజానికి విశేష సేవలు అందజేయడం అభినందనీయమన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్ బి.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు

## భాజపా కార్యాలయం ప్రారంభం

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 22వ వార్డులో భాజపా వార్డు కార్యాలయాన్ని ఆదివారం శివాజీపాలెంలో తూర్పు నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి కొమర రవిరాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో భాజపా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేయడం కోసం ప్రతి వార్డులోను కార్యాలయాలను ప్రారంభించనున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి కుటుంబానికి అందేలా చూడాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా జనరల్ సెక్రటరీ మురళీమోహన్‌రాజు, జిల్లా కార్యదర్శి ఎల్.శ్రీరాం, మీడియా కన్వీనర్ టి.కోటేశ్వరరావు, 22వ వార్డు భాజపా ఇన్‌ఛార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


శివాజీపాలెంలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భాజపా తూర్పునియోజకవర్గ ఇన్‌ఛార్జి రవిరాజ్, నాయకులు

## కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భార్గవ్ సుతేజ, ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో తమను కార్యవర్గంలోకి తీసుకున్నారని.. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.




# విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

## రాజకీయాల్లో బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించండి

గురుద్వారా, న్యూస్‌టుడే: రాష్ట్ర కేబినెట్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు రాజ్యసభ, శాసనసభ, స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శ్రీ వేద విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన బ్రాహ్మణ సంక్షేమ మేధావుల ఆత్మీయ చర్చ వేదికలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పరిషత్ నిర్వాహకులు బాలసుబ్రహ్మణ్యం, సూర్యప్రకాశ్, భాస్కరరావు, దుర్గాశ్రీరామ్ పాల్గొన్నారు.

## కొత్త డ్రైనేజీకి పాత పలకలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి ప్రాంతంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. పైగా ఇప్పటివరకు నిర్మించిన డ్రైనేజీపై కొంత భాగానికి పాత పలకలు(శ్లాబులు) ఏర్పాటు చేశారు. మిగిలిన భాగంపై అసలు పలకలే వేయలేదు. దీంతో కాలువలో మురుగునీరు ముందుకు పారడం లేదు. వర్షం కురిస్తే మురుగు నీరంతా రోడ్డు మీద ప్రవహిస్తోంది. దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీకి పాత పలకలు వేయడం ద్వారా గుత్తేదారుడు అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పనులు నాణ్యంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



తాటిచెట్లపాలెం హైవేలో డ్రైనేజీపై వేసిన పాత పలకలు

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమని రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు ఎన్.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి ఐ.భాస్కరరావు అన్నారు. ఆదివారం రైల్వే న్యూకాలనీ విశ్వతేజ స్కూల్ ఇంటరాక్టివ్ క్లబ్, రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియం, వైఎంసీఏ, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్.రామకృష్ణారావు, కైలాష్ అగర్వాల్, జి.రాజేష్, సుబ్బరాజు, వి.జి.కృష్ణంరాజు, మురళీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ప్రతినిధులు, విద్యార్థులు

## సంప్రదాయ కళల్లో రాణించాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: యువత సంప్రదాయ కళల్లో రాణించాలని గీతం విశ్వవిద్యాలయం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఆముక్త మాల్యద అన్నారు. సీతమ్మధార డాక్టర్స్ కాలనీలో నాట్య కళా క్షేత్ర మ్యూజిక్ అండ్ డాన్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నృత్య సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆముక్త మాల్యద కళాకారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కళాకారిణి టి.నిత్య ప్రదర్శించిన నాట్యం అతిథుల ప్రశంసలు అందుకుంది. నాట్యగురువులు వెంకట్, కె.వెంకట చిన్నారావు, టి.చైతన్య, సత్యవిశాల్ ఎ.లలితా శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.



నాట్యం చేస్తున్న నిత్య

## డేటా సెంటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని పునఃపరిశీలించండి

### సీఎంకు విశ్రాంత ఐఏఎస్ అధికారి శర్మ లేఖ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అధిక నీటి వినియోగంతో కూడిన డేటా సెంటర్లను విశాఖలో ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈమేరకు ఆయన సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను మీడియాకు ఆదివారం విడుదల చేశారు. 'విశాఖలో తలపెట్టిన డేటా సెంటర్లకు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నీటిలో 3.74 టీఎంసీల నీటిని కేటాయిస్తామని శాసనసభలో ప్రభుత్వం వెల్లడించింది. ఆదివాసీల త్యాగాల ఫలితంగా వస్తున్న నీటిని అమెరికా సంస్థలు ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేటాయించడం సబబుగా లేదు. భవిష్యత్తులో విశాఖలో తీవ్రమైన నీటి ఎద్దడి వచ్చే పరిస్థితి ఉంది. విశాఖ ప్రజల సంక్షేమం, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో పునఃపరిశీలన చేయాలి' అని ఈఏఎస్ శర్మ సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## చందాలు వసూలు చేస్తే ఊరుకోం

మాధవధార, గురుద్వారా, న్యూస్‌టుడే: రానున్న వినాయకచవితి పండగలో మండపాల కమిటీ సభ్యులుగా వ్యవహరించడం, చందాలు వసూలు చేయడం చేస్తే చర్యలు తప్పవని కంచరపాలెం సీఐ కోరాడ రామారావు, నాలుగో పట్టణ స్టేషన్ సీఐ సీహెచ్ రాజేశ్ హెచ్చరించారు. ఆదివారం ఆయా స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

## భద్రతకే తొలి ప్రాధాన్యం

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఫైర్, ఇండస్ట్రియల్, కెమికల్ సేఫ్టీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏపీ ప్రభుత్వ ఫ్యాక్టరీల డైరెక్టరు శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పరిశ్రమలు తప్పనిసరిగా భద్రతా చట్టాలను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎ.వరహాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన అభ్యర్థులతో ప్రిన్సిపల్ డా.రమణ, శివశంకర్‌రెడ్డి, డా.లక్ష్మణరావు తదితరులు

# చదువు

e-mail: edc@eenadu.in

ఐఐటీలతో పాటు దేశంలోని మేటి విద్యా సంస్థల్లో ఉన్నత విద్యకూ, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పీఎస్‌యూ)ల్లో అత్యున్నత కొలువులకూ దారి చూపుతుంది గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్). మేటి అవకాశాలకు బాటలు వేసే ఈ ప్రకటన ఇటీవలే వెలువడింది. బీటెక్‌తో పాటు ఇతర డిగ్రీల వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. సరైన ప్రణాళికకు నిబద్ధతను జోడిస్తే సాధారణ విద్యార్థులూ ఇందులో రాణించవచ్చు.

# విస్తృత అవకాశాలకు గేట్ వే






ఐఐఎస్సీ, ఐఐటీలతో పాటు అత్యున్నత సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికీ, పబ్లిక్ సెక్టార్ సంస్థలైన మహారత్న, నవరత్న, మినీరత్నల్లో ఉన్నత ఉద్యోగాలకూ రెండింటికీ గేట్ దారి చూపుతుంది. ప్రైవేటు సంస్థలూ ఈ స్కోరుతో విద్య, ఉన్నత ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పరీక్ష ఇది. అందుకే గేట్ ప్రాధాన్యం ఏటా పెరుగుతోంది. బీటెక్ సిలబస్‌లో అరవై శాతంపై దృష్టి సారిస్తే ఇందులో విజయం సాధించవచ్చు. గేట్ స్కోరు పీజీ ప్రవేశాలకు మూడేళ్లు, పీఎస్‌యూల్లో నియామకానికి ఒకటి లేదా రెండేళ్లు చెల్లుతుంది.

## స్టైపెండ్

గేట్-2027ను ఐఐటీ మద్రాస్ నిర్వహించనుంది. ఈ స్కోరుతో ఇంజినీరింగ్/ టెక్నాలజీ/ సైన్స్/ ఫార్మసీ/ ఆర్కిటెక్చర్/ హ్యూమానిటీస్ సంబంధిత విభాగాల్లో/ శాఖల్లో మాస్టర్ ప్రోగ్రామ్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. గేట్‌తో ఎంటెక్‌లో చేరినవారు ప్రతి నెలా రూ.12,400 స్టైపెండ్ అందుకోవచ్చు. ఇదే స్కోరుతో నేరుగా పీహెచ్‌డీలోనూ చేరిపోవచ్చు. వీరికి మొదటి రెండేళ్లూ నెలకు రూ.37,000, మూడో ఏట నుంచి ఐదో సంవత్సరం వరకూ నెలకు రూ.42,000 స్టైపెండ్ అందుతుంది.

## ప్యాకేజీ

మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వరంగ సంస్థలు గేట్ స్కోరుతో సుమారు రూ.6 లక్షల నుంచి రూ.22 లక్షల వరకూ వార్షిక వేతనం అందిస్తున్నాయి. ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, గెయిల్, బార్క్, హెచ్‌పీసీఎల్.. ఇలా 70కి పైగా సంస్థల్లో అవకాశం ఉంటుంది. వీటిలో ఏటా కనీసం 30-40 సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. అవకాశాలు సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీల వారీ ఉంటాయి.

✦ గేట్ స్కోరుతోనే సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలూ, ఇతర బహుళజాతి సంస్థలూ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం, పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూ ద్వారా అవకాశం కల్పించడం చేస్తున్నాయి.

## పరీక్ష

ఈ సారి 30 పేపర్లలో గేట్ నిర్వహిస్తున్నారు. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ పేపర్‌ను కొత్తగా చేర్చారు. సిలబస్‌తో పాటు కొన్ని పేపర్ కోడ్‌లూ మారాయి. అభ్యర్థులు అవకాశాన్ని బట్టి రెండు పేపర్లలో పరీక్ష రాసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 300కు పైగా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ విభాగాల పరీక్షలో 100 మార్కులకు 65 ప్రశ్నలు ఉంటాయి. వ్యవధి మూడు గంటలు. ప్రశ్నాపత్రంలో రెండు విభాగాలుంటాయి.

విభాగం-1 (జనరల్ ఆప్టిట్యూడ్): ఇందులో పది ప్రశ్నలుంటాయి. ఒక మార్కు ప్రశ్నలు 5, రెండు మార్కుల ప్రశ్నలు 5 వస్తాయి. ఈ విభాగంలోని నాలుగు నుంచి ఐదు ప్రశ్నలు ఇంగ్లిష్ (వెర్బల్ ఎబిలిటీ) నుంచి, మిగతా ప్రశ్నలు క్వాంటిటేటివ్‌కు సంబంధించినవై ఉంటాయి.

విభాగం-2 (సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టులు) మొత్తం 55 ప్రశ్నలుంటాయి. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు 25, రెండు మార్కుల ప్రశ్నలు 30 ఉంటాయి.

✦ ఇంజినీరింగ్ విభాగాలైతే.. జనరల్ ఆప్టిట్యూడ్ 15 మార్కులకు, ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్ 13 మార్కులకు, కోర్ సబ్జెక్టు ప్రశ్నలు 72 మార్కులకు ఉంటాయి. ఎక్కువ ప్రశ్నలు సంబంధిత రంగాల్లోని నూతన ఆవిష్కరణలపై వస్తాయి. అభ్యర్థులు ఎంచుకున్న పేపర్ ప్రకారం ప్రశ్నల సంఖ్యలో మార్పులు ఉంటాయి.

## ప్రశ్నలు ఇలా

ఈ ఆన్‌లైన్ పరీక్షలో ప్రశ్నాపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఇందులో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు.

1. **బహుళైచ్ఛిక ప్రశ్నలు:** నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అందులో ఒకటే సరైనది. దాన్నే గుర్తించాలి.

2. **బహుళ ఎంపిక ప్రశ్నలు:** ఇవి కూడా బహుళైచ్ఛిక ప్రశ్నలు గానే ఉంటాయి. కానీ ఇందులో ఒకటి కంటే ఎక్కువ సరైన ఆప్షన్లు ఉంటాయి. ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో మూడు సరైనవైతే ఆ సరైన మూడు ఆప్షన్లూ గుర్తించాలి. ఒకవేళ ఒకటి లేదా రెండు సరైన ఆప్షన్లు గుర్తిస్తే ఎలాంటి మార్కులూ ఇవ్వరు.

3. **సంఖ్యా సమాధాన ప్రశ్నలు (న్యూమరికల్):** ఎలాంటి ఆప్షన్లూ ఉండవు. సమాధానాలు వర్చువల్ కీబోర్డును ఉపయోగించి రాయాలి.

✦ గేట్‌లో తప్పు సమాధానానికి ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో మూడో వంతు తగ్గిస్తారు. అంటే ఒక మార్కు ప్రశ్నకు 1/3, రెండు మార్కులదైతే 2/3చొప్పున మైనస్ మార్కులుంటాయి. న్యూమరికల్ ప్రశ్నలకూ, బహుళ ఎంపిక ప్రశ్నలకూ రుణాత్మక మార్కులుండవు.

## సన్నద్ధత

✦ పరీక్ష విధానాన్ని అర్థం చేసుకోవడంతో పాటు మీరు రాయాలనుకున్న పేపర్‌కు సంబంధించి సిలబస్‌లో మార్పులు గమనించాలి.

✦ అధ్యయనంలో పాత ప్రశ్నాపత్రాలే దిక్సూచి. వీటిని పరిశీలిస్తే ఏ అంశాలు, ఏ కాన్సెప్టులకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తోందో తెలుసుకోవచ్చు. వేటిపై అధిక దృష్టి సారించాలో అర్థం చేసుకుని, ప్రణాళిక వేసుకోవాలి.

✦ గేట్ ఫిబ్రవరిలో ఉంటుంది. అంటే ఇప్పటి నుంచీ 5 నెలల కంటే ఎక్కువ సమయమే అందుబాటులో ఉంది. ఈ వ్యవధిలో సన్నద్ధత పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

✦ ప్రతి సబ్జెక్టులోనూ ఒకటి లేదా రెండే ప్రామాణిక పుస్తకాలు తీసుకుని, వాటినే బాగా చదవాలి.

✦ ఎన్‌టీపీఈఎల్ పాఠాలు ప్రాథమిక అంశాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడతాయి. అలాగే విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయడానికీ ఉపయోగపడతాయి. అందువల్ల వాటినీ శ్రద్ధగా వినాలి.

✦ ఏదైనా అంశం చదవడం పూర్తయిన తర్వాత అందులో అధిక సంఖ్యలో మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ఆ తర్వాత మాక్ టెస్టు రాసి, సన్నద్ధత ఎలా ఉందో తెలుసుకోవాలి.

✦ సిలబస్ మొత్తం చదవడం పూర్తయిన తర్వాత అసలైన గేట్‌ను పోలి ఉండే మాక్ టెస్టులు విస్తృతంగా రాయాలి. ఇవి రాస్తున్నప్పుడు చేస్తోన్న తప్పులపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవి తర్వాతి పరీక్షల్లో రాకుండా చూసుకోవాలి.

✦ పలు పీఎస్‌యూలు నిర్వహిస్తోన్న పరీక్షల ప్రశ్నాపత్రాలూ గేట్ అధ్యయనంలో ఉపయోగపడతాయి. ఇవన్నీ గమనించడం వల్ల ఒక అంశాన్ని ఎన్ని రకాలుగా పరీక్షలో అడగవచ్చో తెలుసుకోవచ్చు.

## వివరాలు

**అర్హతలు:** ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, కామర్స్, సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** గరిష్ఠ పరిమితి లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబరు 27. **దరఖాస్తు ఫీజు:** మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1000. మిగిలిన అందరికీ రూ.2000. **పరీక్ష తేదీలు:** ఫిబ్రవరి 6, 7, 13, 14, 20, 21. **వెబ్‌సైట్:** https://gate2027.iitm.ac.in

"గేట్‌లో విజయానికి బీటెక్ మొత్తం సిలబస్ చదవాల్సిన అవసరం లేదని గుర్తుంచుకోవాలి. నాలుగేళ్ల ఇంజినీరింగ్ సిలబస్‌లో దాదాపు 60 శాతమే పరీక్షలో భాగంగా ఉంటుంది. ఇంజినీరింగ్ బ్రాంచీ మూలాలు, నూతన పోకడలకే అధిక ప్రాధాన్యం. ఇప్పటి నుంచీ రోజుకు 8 గంటలు కేటాయిస్తే సిలబస్ మొత్తం క్షుణ్నంగా చదివేయొచ్చు. కాన్సెప్టుల వారీ అర్థంచేసుకుని, అధ్యయనం కొనసాగించాలి"

---

## సివిల్స్ కోసం ఏ కోర్సు బాగు?

ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్నాను. నా లక్ష్యం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్. ఇందుకు అనుగుణంగా యూజీలో ఏ కోర్సులో చేరితే బాగుంటుంది? - వినోద్



■ సివిల్స్ రాయడానికి ఏదైనా గుర్తింపు పొందిన డిగ్రీ సరిపోతుంది. అయితే, ఎంచుకునే కోర్సు సివిల్స్ సన్నద్ధతకు ఎంతవరకు ఉపయోగపడుతుంది? విద్యార్థి ఆసక్తి, సామర్థ్యాలకు సరిపోతుందా? ఒకవేళ సివిల్స్‌లో ఆశించిన ఫలితం రాకపోతే ప్రత్యామ్నాయ కెరియర్‌కు ఉపయోగపడుతుందా? అనే అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.

▶ సామాజిక, రాజకీయ, చరిత్ర, ఆర్థిక అంశాలపై ఆసక్తి ఉండి, సివిల్సే ప్రధాన లక్ష్యమైతే బీఏలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టులను ఎంచుకోవడం మంచి నిర్ణయం. డిగ్రీలోనే వీటిని చదవడం వల్ల సివిల్స్ ప్రిపరేషన్ కొంత సులభమవుతుంది. వ్యాసరచన, విశ్లేషణాత్మక సమాధానాలు రాయడంలోనూ ప్రయోజనం ఉంటుంది. అలాగే పొలిటికల్ సైన్స్, హిస్టరీ లాంటి సబ్జెక్టులను మెయిన్స్‌లో ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశమూ ఉంటుంది.

▶ ఎంపీసీ విద్యార్థులకు బీఎస్సీ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ లేదా డేటా సైన్స్ మంచి ఎంపికలు. ఇవి సివిల్స్‌లోని సీశాట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు ఉపయోగపడతాయి. ఒకవేళ సివిల్స్‌లో రాణించలేకపోతే స్టాటిస్టిక్స్, డేటా అనలిటిక్స్, ఐటీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, ఫైనాన్స్, మార్కెట్ రిసెర్చ్ లాంటి రంగాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలూ ఉంటాయి.

▶ సివిల్స్ రాయడానికి బీటెక్ కూడా మరో ప్రత్యామ్నాయం. ఇంజినీరింగ్ ద్వారా టెక్నికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సాంకేతిక ఉద్యోగాలు, ఉన్నత విద్య లాంటి అవకాశాలు ఉంటాయి. అయితే బీటెక్‌లో తరగతులు, ల్యాబ్‌లు, ప్రాజెక్టుల భారం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున సివిల్స్ ప్రిపరేషన్‌కు ప్రత్యేకంగా సమయం కేటాయించాలి.

▶ సివిల్స్‌లో విజయం సాధించలేకపోయినా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సివిల్స్ ప్రిపరేషన్ ఎంతో ఉపయోగపడుతుంది.

సివిల్సే ప్రధాన లక్ష్యంగా సామాజిక శాస్త్రాలపై ఆసక్తి ఉంటే బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ అనుకూలం. సివిల్స్‌తో పాటు బలమైన ప్రత్యామ్నాయ కెరియర్ కూడా కావాలంటే బీఎస్సీ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ లేదా బీటెక్‌నూ పరిశీలించవచ్చు. ఏ డిగ్రీ ఎంచుకున్నా మొదటి సంవత్సరం నుంచే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, కరెంట్ అఫైర్స్, వార్తాపత్రిక పఠనం, వ్యాసరచన, ఆన్సర్ రైటింగ్‌ను క్రమంగా కొనసాగించడం ఉత్తమ వ్యూహం.



- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

## ఎన్ఎఫ్‌సీలో అప్రెంటిస్‌లు

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), హైదరాబాద్.. ఏడాది అప్రెంటిస్‌షిప్ కోసం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ● ఐటీఐ ట్రేడ్ : 432 ఖాళీలు ● డిప్లొమా ఇంజినీరింగ్: 79 ఖాళీలు ● గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్: 27 ఖాళీలు. **విభాగాలు/ ట్రేడులు:** మెకానికల్ ఇంజినీరింగ్, కెమికల్, మెటలర్జికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అవసరం. **వయసు:** 18 ఏళ్లు నిండాలి. **స్టైపెండ్:** నెలకు ఐటీఐ అప్రెంటిస్‌లకు రూ.11,040; సీఓపీఏ, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్‌లకు రూ.10,560; డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.10.900; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,300. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **దరఖాస్తు:** ఎన్ఏపీఎస్, ఎన్ఏటీఎస్ పోర్టల్ ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16. **వెబ్‌సైట్:** https://www.nfc.gov.in/

---



## అరుణ్‌కుమార్ సేవలు మరువలేనివి

గురుద్వారా, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ పూర్వ సభ్యుడు, న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ సేవలు మరువలేనివని చిత్తూరు జిల్లా న్యాయమూర్తులు ఎన్.శ్రీనివాసరావు, ఎంవీఎన్ పద్మజ అన్నారు. రామా టాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం అరుణ్ కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ న్యాయవాది వృత్తికి గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి బైపా అని కొనియాడారు. నేటితరం న్యాయవాదులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని వృత్తిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ అధ్యక్షుడు పి.రామకృష్ణ, డీఎస్పీ ఎన్.కాళిదాసు, డాక్టర్ ఉదయ్‌కుమార్, ఆచార్య సి.ప్రజ్ఞ, సూర్యనారాయణ, న్యాయవాదులు చిన్నారావు, సుబ్బారావు, కదిరి రాము, మధు, అహ్మద్, జేవీ ప్రభాకర్, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, పి.రాజేశ్వరరావు, ఎస్వీ రమణ, వై.వసంత, రవి, సిద్ధార్థ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



అరుణ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

## మార్షల్ ఆర్ట్స్‌లో క్రీడాకారుల సత్తా

గురుద్వారా, విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నై, విశాఖ నగరాల్లో ఈ నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ సంస్థ క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచారని నగరానికి చెందిన పీఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పి.నరసింహరావు తెలిపారు. ఆదివారం గురుద్వారా దరి వసంతబాల పాఠశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది స్వర్ణ, 12 మంది రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేశ్ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం పీఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన శివరామకృష్ణ, పృథ్వీరాజ్‌లను సౌత్ ఇండియా, రాష్ట్ర కరాటే చీఫ్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకులు ఎస్‌వీ రమణ, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

## యోగాసనాలతో మానసిక ప్రశాంతత

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: యోగాసనాల సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 51వ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్ ఛాంపియన్‌షిప్-2026 ఆదివారం ముగిసింది. వివిధ విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాతో ఏకాగ్రత మెరుగుపడుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. పోటీల్లో 25 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 8 నుంచి 45 సంవత్సరాల వయసు గల బాలురు, బాలికలు, పురుషులు, మహిళలను 11 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. ఏపీ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యు.ఎస్.సెల్వం, ప్రధాన కార్యదర్శి ఎం.అవినాష్, జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్.ఎం.ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

## ముగిసిన ప్రత్యేక ఓటరు శిబిరాలు

మాధవధార, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఆదివారం పలు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలకు నామమాత్రంగానే స్పందన వచ్చింది. 293 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు తమ పరిధిలోని ఓటర్లకు సరైన సమాచారం ఇవ్వకపోవడం ఓ కారణం కాగా, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకోవాలని అధికారులు సూచించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రెండు రోజులు పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు నామామాత్రంగానే సాగాయి. నియోజకవర్గంలో తొలగించిన 38 వేల ఓటర్లలో ఈ శిబిరాల ద్వారా 10 శాతం మంది కూడా తిరిగి దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. అదేవిధంగా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు సైతం నూతనంగా ఓటును నమోదు చేసేకునేందుకు అవకాశం కల్పించినా పెద్దగా స్పందన రాలేదు.



మాధవధార ఉన్నత పాఠశాల వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది



## మర్యాదపూర్వక కలయిక

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును ఆదివారం అక్కయ్యపాలేనికి చెందిన మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ మళ్ల వెంకటరావు, ఆయన తనయుడు కిశోర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. దసపల్లా హిల్స్‌లోని గవర్నర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

– న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

## పోలీసు మృతుల కుటుంబాలకు వేతన ప్యాకేజీ బీమా అందజేత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా వేతన ప్యాకేజీ బీమా పరిహారాన్ని అందజేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కె.అప్పారావు కుటుంబానికి రూ.10 లక్షలు, పి.అప్పారావు కుటుంబానికి రూ.10 లక్షలు చెక్కు రూపంలో సీపీ శంఖబ్రత బాగ్చీ అందజేశారు. ఆ బ్యాంక్ ఏజీఎం పి.రాజేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం రాజేష్

## తెదేపా పాలనలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా పాలనలో బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని కార్పొరేషన్ల డైరెక్టర్లు కోట నరేష్ (నాయీబ్రాహ్మణ), సనపల వరప్రసాద్ (కాళింగ), సీఎం రమణ (నాగవంశ) అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిస్తూ బీసీలను ప్రగతి పథంలోకి తీసుకెళ్తోందన్నారు. నియమిత పదవులు కేటాయిస్తూ.. సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వైకాపా పాలనలో బీసీలపై వివిధ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని ఆక్షేపించారు.

## నేడు పీజీఆర్ఎస్

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్), రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ★ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

## రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో వారానికి మూడు రోజుల పాటు రౌండ్ టేబుల్ సంస్థ అన్నదానం నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆ సంస్థ మాజీ ఛైర్మన్ మక్సూద్ అహ్మద్ ప్రారంభించారు. నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న అప్పలరాజుకు రూ.5 వేలు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వన్‌టౌన్



## 'హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాల్సిందే'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలని బహుజన సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళిత, బహుజన, ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన హమారా ప్రసాద్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ రాసిన పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. దళిత సంఘాల ప్రతినిధులు జి.రవికుమార్, వై.బాలకష్ణ, కుమార్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

## భక్తిశ్రద్ధలతో సత్తెమ్మతల్లి పండగ

గాజువాక, న్యూస్‌టుడే: బీసీరోడ్డు రాజీవ్‌మార్గ్ గ్రామదేవత సత్తెమ్మతల్లి అమ్మవారి ప్రధాన పండగ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, అఖిలపక్ష నాయకులు ప్రత్యేక పూజల్లో పాలుపంచుకున్నారు. సత్తెమ్మతల్లి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సూరిశెట్టి శివ, అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, ప్రతినిధులు శరగడం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మల్కాపురం, న్యూస్‌టుడే : మాలలకు జరుగుతున్న అన్యాయాలపై, మరోవైపు భారతదేశంలో రిజర్వేషన్లు తీసేయడానికి జరుగుతున్న కుట్రలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర మాలమహానాడు ఉపాధ్యక్షుడు మాటూరి చిన్నారావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్ సామాజిక భవనంలో మాల మహానాడు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

**సమస్య:** గాజువాక వుడాకాలనీలో తాగునీటి పైపులైను పగిలిపోయి నీరంతా వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదే పరిస్థితి కూర్మన్నపాలెం శివారు సాయిరాంనగర్‌లోనూ ఉంది. –సత్యనారాయణ, వుడాకాలనీ, రావు, సాయిరాంనగర్, **సమాధానం :** ఇప్పటికే సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చాం. –కేదార్‌నాథ్, ఏఈ, **?:** గాజువాక సినిమాహాలు కూడలి వద్ద గతంలో బస్‌షెల్టర్లు ఉండేవి. వాటిని తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. –డేవిడ్, గాజువాక, **✔:** పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. –రాయల్‌బాబు, ఇ.ఇ.

## ఎట్టకేలకు పనుల్లో కదలిక

స్పందనకు వందనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పడుతూ, లేస్తున్న పెదగంట్యాడ బీసీరోడ్డు అభివృద్ధి పనులకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. అసంపూర్తి కల్వర్టులు, డ్రైనేజీ పనులు తిరిగి ప్రారంభం కావడంతో నివాసితులు ఊరట చెందారు. 'ఈనాడు'లో రహదారి దుస్థితిపై వరుసగా కథనాలు రావడంతో సంబంధిత అధికారులు రంగంలోకి దిగి పనులకు శ్రీకారం చుట్టారు.

## అడుగుకో గొయ్యి.. ఆచితూచి అడుగెయ్యి



చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే చినగంట్యాడ జగ్గుసెంటర్ నుంచి అమరావతి పార్కు మీదుగా గోపాలరెడ్డినగర్ వెళ్లే ప్రధాన మార్గం అతుకుల బొంతగా తయారైంది. అడుగడుగునా గోతులతో అడుగు ముందుకు వేయాలంటే పాదచారులు, వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రహదారిని పునరుద్ధరిస్తామని జీవీఎంసీ అధికారులు పదే పదే చెబుతూనే రెండేళ్లు గడిపేశారు. పెదగంట్యాడ చుట్టుపక్కకాలనీ వాసులు చినగంట్యాడ రావాలన్నా, ఇటు పెదగంట్యాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారంతా తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం రహదారిని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

## 'మహా'శయా.. పట్టించుకోండి..!

### దుర్గంధమయం జోనల్ కార్యాలయం

గాజువాక, న్యూస్‌టుడే: పదిమందికి ఆదర్శంగా నిలవాల్సిన జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం పరిసరాలు పట్టించుకున్న నాథుడులేక మురుగుమయంగా మారాయి. కార్యాలయం వెనుక డ్రైనేజీ అవుట్‌లెట్ జామై మురుగు ఏరులై పారుతోంది. వాడుక నీరు ఎటూ వెళ్లక వివిధ విభాగాల అధికారుల ఛాంబర్ల వద్ద దుర్గంధంతో అంతా ఇబ్బందుకు గురవుతున్నారు. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని కోరుతున్నారు.



## దారంతా రాళ్లమయం..

టిడ్కో ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బందే



పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ బీసీరోడ్డు వద్ద టిడ్కో గృహసముదాయానికి వెళ్లే మార్గం పునరుద్ధరణకు నోచుకోక అధ్వానంగా తయారైంది. ... బీసీరోడ్డు నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం గులకరాళ్లు, మట్టి దిబ్బలు, సిమెంటు పిక్కతో అడుగు తీసి అడుగేయడానికి వీల్లేకుండా పోయింది. కొద్దిపాటి వర్షాలకే మార్గం చిత్తడిగా మారుతోంది. పిల్లలు, వృద్ధుల ఇబ్బందులు గుర్తించి తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



## సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు

అగనంపూడి, న్యూస్‌టుడే : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా అగనంపూడిలో రెండు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ 79వ వార్డు జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన వేడుకల గోడపత్రికలను ఆవిష్కరించారు. జనసేన నాయకులు నారపిన్ని అప్పలరాజు, తలారి సన్యాసిరావు, ఎన్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరించిన జనసేన నాయకులు

## ఆట.. పాట.. అదరహో

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : ఉక్కునగరం డీపాల్ స్కూల్ ఆధ్వర్యంలో రాఫ్టడీ సీజన్-5 పేరుతో అంతర్ పాఠశాల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఫాదర్ లిబిన్ వర్గీస్, ఫాదర్ సాజీ, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

## శ్రీవారి నిత్య దీపారాధనకు రూ. 1 లక్ష విరాళం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి నిత్య దీపారాధనకు దొండపర్తి వాస్తవ్యులు వారణాసి శ్రీనివాస్, జయలక్ష్మీ దంపతులు రూ.1లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయ ట్రస్ట్ ప్రతినిధులకు చెక్కును దాత అందజేశారు. అర్చకులు దాతను సత్కరించారు.



ఆలయ ట్రస్టు ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న దాత శ్రీనివాస్, జయలక్ష్మీ దంపతులు

## ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. షీలానగర్ ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో సుమారు 600 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. ఏసీపీ శ్రీనివాసరావు, సీఐలు వాసు నాయుడు, హుస్సేన్, ఎస్సై రాధాకృష్ణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

## ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: సంస్కార భారతి, స్టీల్ క్లబ్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సెక్టారు-3లోని డీఏవీసీ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉక్కు జీఎం ఆర్.రవిచంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సుగంధకుమారి, కె.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, ఎం.సాయిరామరాజు, తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



■ **2న గాజువాకలో బైక్ ర్యాలీ**

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలో జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పీఏసీ సభ్యుడు కోన తాతారావు అధ్యక్షతన నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు గాజువాకలో బైకు ర్యాలీ, 11 గంటలకు కేరళ నుంచి లైవ్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడతారన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

■ **కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పార్టీకి కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక క్యాంపు కార్యాలయంలో పీఎస్ఆర్ సంస్థల యజమాని, న్యాయవాది పెంటకోట శంకరరావు తెదేపాలో చేరిన సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి అభినందించారు. యువత నాయకులు పాల్గొన్నారు.

■ **పోలీసు స్పోర్ట్సుమీట్‌కు న్యాయనిర్ణేతల నియామకం**

గాజువాక, న్యూస్‌టుడే: వచ్చేనెల 1 నుంచి నాలుగురోజులపాటు మంగళగిరిలో నిర్వహించనున్న ఏపీ పోలీసు స్పోర్ట్సు మీట్‌కు న్యాయనిర్ణేతలుగా విశాఖ నగరానికి చెందిన మాజీ సైనికుడు జి.ఈశ్వరరావు, విశాఖ పోర్టుకు చెందిన సీహెచ్ చినబాబు, బి.గణపతిరెడ్డిలు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్పోర్ట్సు కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

■ **ప్రకాశ్ సేవలు ప్రశంసనీయం**

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి 40 ఏళ్లుగా కృషి చేసిన బెల్ సిటూ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ సేవలు ప్రశంసనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. బెల్ కల్యాణ మండపంలో ఆదివారం జీటీపీ ప్రకాశ్ ఉద్యోగ విరమణ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రకాశ్ దంపతులను సత్కరించారు.

■ **ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి**

గోపాలపట్నం: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో సర్వసభ్య సమావేశం జరగ్గా.. ఇందులో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీలో రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన భార్గవ్ సుజేత్, ఉపాధ్యక్షుడిగా బండారు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘ ప్రతినిధులు, సభ్యులను పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బాజీకూడలిలోని ఎస్సీకాలనీలో అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులోభాగంగా నూతన కమిటీ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా గొట్టు నారాయణరావు, కార్యదర్శిగా కోనపల్లి సతీశ్‌కుమార్, కోశాధికారిగా కంబాల కరుణ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. అడ్వైజర్లుగా ఆనంద్, సూరిబాబు, అప్పలరాజు నియమితులయ్యారు. చెంగల హరినాథ్ పర్యవేక్షించారు.

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం టౌన్‌సెక్షన్‌లో కొత్తపాలెం ఉపకేంద్రం, ఎల్లపువానిపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్తు మరమ్మతులో భాగంగా సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 డివిజనల్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు, స్థానిక ఏఈ శ్యామ్‌సుందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, మూడుగుళ్లప్రాంతం, రామాలయం వీధి, ఎస్సీకాలనీ, ఎయిర్‌పోర్టురోడ్డు, గణేశ్‌నగర్, సంతోశ్‌నగర్, క్లబ్ జంక్షన్, ఎల్లపువానిపాలెం పరిసర ప్రాంతాల్లో సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సింధియా, న్యూస్‌టుడే : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మల్కాపురం సీఐ ఇ.నరసింహారావు హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం రాత్రి స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు భంగం వాటిల్లే మాదిరిగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. మంచి ప్రవర్తనతో సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరసింహారావు

## 'మూడుసార్లు పంచింగ్ తగదు'

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగులు విధుల ప్రారంభ, ముగింపు సమయాల్లో పంచింగ్ చేస్తారు. ఇపుడు మధ్యలో కూడా పంచింగ్ చేయాలంటూ ఉక్కు యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సిటూ ఆదివారం విడుదల చేసిన ఓ కరపత్రంలో పేర్కొంది. మూడో పంచ్ పేరుతో పనిగంటల వృథా తప్పా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మాని కర్మాగారం అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



## బారులు తీరి.. ఓట్లు వేసి..



ఓటు వేసేందుకు బారులు తీరిన గ్రామస్థులు

మల్కాపురం, న్యూస్‌టుడే : ఓటర్లు ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు. పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆదివారమైనా యువత ఎక్కడకు వెళ్లకుండా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడి వాతావరణం సాధారణ ఎన్నికకు ఏమాత్రం తీసిపోని విధంగా కనిపించినా.. ఇది గ్రామ కమిటీ ఎన్నిక కావడం విశేషం. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం గ్రామ కమిటీ ఎన్నిక ఆదివారం జరగ్గా.. 1996 ఓట్లు పోలయ్యాయి. సుదర్శన్ చక్రం గుర్తుతో మేండ నీలంరాజు, బాణం గుర్తుతో సింగవరపు సత్యనారాయణ, స్కూటీ గుర్తుతో జోగ రాజేష్ గ్రామ అధ్యక్ష పదవికి పోటీ పడగా.. నీలంరాజు 141 ఓట్లతో తన సమీప ప్రత్యర్థి సత్యనారాయణపై విజయం సాధించారు. మల్కాపురం సీఐ నరసింహారావు బందోబస్తు పర్యవేక్షించారు.





## కాపు ఐక్యతా సంఘం ఏర్పాటుకు తీర్మానం

గోపాలపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలోని వివిధ కాపు సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కాపు ఐక్యతా సంఘం ఏర్పాటు చేయాలని సంఘ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. ఆదివారం జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లోని కేటీబీ కళాక్షేత్రంలో సంఘ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముత్యాలు మాట్లాడుతూ.. కాపు సామాజిక వర్గ అభ్యున్నతికి కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సుబ్బారావు, మురళీకృష్ణ, సన్యాసిరావు, కళావతి, చిరంజీవి, కోటేశ్వరరావు, అప్పారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాపు సంఘాల నాయకులు





## అభివృద్ధి పనులకు భూమి పూజ

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు కొండవాలుపై బొబ్బిలివీధిలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న రోడ్డు, డ్రైనేజీ పనులకు వార్డు తెదేపా అధ్యక్షులు రమణ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్సు విభాగం డీఈ సంతోష్, సచివాలయం కార్యదర్శి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పార్టీ నాయకులు ఆర్ ఆర్ రాజు, కల్లూరి రామారావు, దేవీ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న తెదేపా నాయకులు